ఈనాడు
బాపట్ల
శుక్రవారం అక్టోబరు 18, 2024


జాతీయ రహదారిపై తొలగించిన చెట్లు


బాపట్ల-గుంటూరు రోడ్డులో తొలగించిన భారీ వృక్షం

వందల చెట్లు కొట్టేశారు.. ఒక్కటైనా నాటలేదు..

బాపట్ల, న్యూస్‌టుడే

బాపట్ల పట్టణంలోని మార్కెట్‌యార్డు నుంచి ఇంజినీరింగ్ కళాశాల వరకు రూ.72 కోట్ల వ్యయంతో 8.5 కి.మీ. పొడవున 216 ఏ జాతీయ రహదారిని విస్తరించారు. రోడ్డు పక్కనే రెండు వైపులా వేప, మర్రి, అశోక, చింత, రావి తదితర భారీ వృక్షాలు 272 ఉన్నాయి. ఎండ తీవ్రంగా ఉన్నప్పుడు పాదచారులు, ద్విచక్ర వాహనదారులు వృక్షాల కింద సేదతీరేవారు. రహదారి విస్తరణ పనుల పేరుతో వీటిని తొలగించటానికి అటవీశాఖ నుంచి ఎన్‌హెచ్ అధికారులు 2022లో అనుమతి తీసుకున్నారు. యంత్రాలతో భారీ వృక్షాలు కూల్చివేశారు. విస్తరణ పనులు ఆరు నెలల క్రితం పూర్తి చేశారు.

> జిల్లా పరిధిలో 216 ఏ జాతీయ రహదారి విస్తరణలో భాగంగా వందల సంఖ్యలో భారీ వృక్షాలు, చెట్లను ఎన్‌హెచ్ అధికారులు తొలగించారు. రహదారి విస్తరణ పనులు పూర్తి చేసినా నరికివేసిన వృక్షాలు, చెట్ల స్థానంలో మొక్కలు నాటలేదు. పచ్చదనం తగ్గిపోయి రోజు రోజుకు కాలుష్యం పెరుగుతోంది. పురపాలక సంఘం పరిధిలో నరికివేసిన చెట్ల కలప ఎటుబోయిందో ఎవరికీ తెలియలేదు. చెట్లు లేక బోసిపోయి రహదారి కనిపిస్తోంది.

నుంచి బాపట్ల మండలం స్టూవర్టుపురం వరకు 68 కి.మీ. పొడవున జాతీయ రహదారి విస్తరణ పనుల కోసం 720 వృక్షాలు, చెట్లు తొలగించారు. భట్టిప్రోలు మండలం పల్లెకోన వద్ద ఆర్వోబీ మినహా ఎన్‌హెచ్ విస్తరణ పనులు పూర్తయ్యాయి. వీటి స్థానంలో 7200 మొక్కలు నాటాల్సి ఉండగా అధికారులు పట్టించుకోలేదు. మండుటెండలో మార్గ మధ్యలో కొద్దిసేపు విశ్రాంతి తీసుకోవడానికి ఆగుదామన్నా చెట్లు లేకుండా పోయాయి. బాపట్ల పట్టణంతో పాటు జాతీయ రహదారి వెంబడి పచ్చదనం తగ్గిపోయింది. ఇప్పటికైనా ఎన్‌హెచ్ అధికారులు స్పందించి జాతీయ రహదారి వెంబడి మొక్కలు నాటి సంరక్షణ చర్యలు చేపట్టాల్సి ఉంది.

ఒక చెట్టుకి పది మొక్కలు నాటాలి..

నిబంధనల ప్రకారం ప్రగతి పనుల కోసం ఓ భారీ వృక్షాన్ని తొలగిస్తే దాని స్థానంలో కొత్తగా పది మొక్కలు నాటాలి. పురపాలక సంఘం పరిధిలో తొలగించిన 272 వృక్షాలు, చెట్ల పరిధిలో 2720 మొక్కలు నాటి సంరక్షించాలి. ఇంత వరకు ఒక్క మొక్క కూడా నాటలేదు. పర్యావరణ నిబంధనలకు ఎన్‌హెచ్ అధికారులు తూట్లు పొడుస్తున్నారు. జిల్లా ఆవిర్భావం తర్వాత పట్టణంలో కొత్త బస్టాండ్ నుంచి కలెక్టరేట్ వరకు రహదారిని విస్తరించాలని నిర్ణయించారు. ఆర్‌అండ్‌బీ అధికారుల ద్వారా భారీవృక్షాలను నరికివేసి తొలగించారు. రహదారి విస్తరణ పనులు చేపట్టలేదు. తొలగించిన వృక్షాల స్థానంలో కొత్త మొక్కలు నాటలేదు. రేపల్లె మండలం పెనుమూడి


బాపట్ల పట్టణ పరిధిలో విస్తరించిన 216 ఏ జాతీయ రహదారి

నోటీసులు జారీ చేస్తాం

రహదారి విస్తరణ పనుల సమయంలో తొలగించిన భారీ వృక్షం స్థానంలో కొత్తగా పది మొక్కలు నాటుతామని చెప్పి ఎన్‌హెచ్ అధికారులు అనుమతి తీసుకున్నారు. జాతీయ రహదారి విస్తరణ పనులు పూర్తి చేసినా ఇంకా మొక్కలు ఎందుకు నాటలేదని ఎన్‌హెచ్ అధికారులకు నోటీసులు జారీ చేస్తాం. పురపాలక సంఘం పరిధిలో అయితే ప్రాజెక్టు వ్యయంలో మొక్కలు నాటే అంశం లేకపోతే పురపాలక అధికారులే మొక్కలు నాటే బాధ్యతలు చేపట్టాల్సి ఉంది. పురపాలక అధికారులకు ఈ విషయాన్ని గుర్తుచేసి మొక్కలు నాటేలా చూస్తాం.

– భీమయ్య, జిల్లా అటవీశాఖాధికారి

సాగర్ నుంచి నీటి విడుదల

విజయపురిసౌత్, న్యూస్‌టుడే: నాగార్జున సాగర్ డ్యాం నాలుగు క్రస్టుగేట్ల ద్వారా 32,400 క్యూసెక్కుల నీటిని దిగువ కృష్ణాకు విడుదల చేస్తున్నారు. సాగర్ ప్రధాన జలవిద్యుత్తు కేంద్రానికి 29,557 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. సాగర్ కుడి కాలువకు 8067, ఎడమ కాలువకు 6173, ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టుకు 2400, లో లెవల్ కెనాల్‌కు 400 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.


చినగంజాం : నీలాయపాలెంలో వరి పొలాల్లో నీరు


నీట మునిగి కట్టలు కరిగిన ఉప్పు కొఠారులు

నాలుగు రోజులుగా నీటిలోనే పొలాలు

చినగంజాం, న్యూస్‌టుడే: నాగన్న వాగు ఉద్ధృతికి నీలాయపాలెం గ్రామ పరిధిలోని సుమారు 300 ఎకరాల వరి పొలాలు నాలుగు రోజులుగా నీటిలో మునిగి ఉన్నాయి. మునుపెన్నడూ లేని విధంగా గ్రామం చుట్టూ నీరు చేరి, పొలాలు వరద ముంపునకు గురై తమకు నష్టం కల్గించిందని రైతులు వ్యథ చెందుతున్నారు. ఎకరాకి ఇప్పటి వరకూ రూ.20 వేలు వరకు వ్యయం చేశామని రైతులు తూమాటి అజయ్‌బాబు, ఆరే సుబ్బారావు, శ్రీనివాసరావు తెలిపారు. నాలుగు రోజుల తర్వాత వరద నీరు తగ్గినా పైర్లు పుంజుకుంటాయనే నమ్మకం లేదంటున్నారు. నాట్లు వేసిన తర్వాత కురుస్తున్న వర్షానికి పైర్లకు మేలు జరుగుతుందని భావించామని తెలిపారు. నాగన్నవాగుకు వచ్చిన వరదలు తమ పొలాలను పూర్తిగా ముంచేసినట్లు వాపోయారు. అధికారులు పొలాలను పరిశీలించి ప్రభుత్వ పరంగా న్యాయం జరిగేలా చూడాలని కోరుతున్నారు.

ఉప్పు కొఠారుల్లో దెబ్బతిన్న కట్టలు

చినగంజాం, పెదగంజాంలో నాలుగు రోజులుగా కురిసిన వర్షాలకు ఉప్పు కొఠారుల్లో భారీగా వరద నీరు చేరింది. దీనివల్ల కట్టలు కరిగాయని రైతులు సత్యనారాయణ, శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఏటా వర్షాలు కురిసిన తర్వాత నవంబరు, డిసెంబరు నెలల్లో కొత్తగా ఉప్పు సాగును రైతులు ప్రారంభిస్తారు. తీతల సమయానికి ఎకరాకి కూలీ ఖర్చులు సుమారు రూ.15వేల నుంచి రూ.20 వేలు అయ్యేదని రైతులు తెలిపారు. ఈసారి అధిక వర్షం కురవడంతోపాటు వరద నీరు చేరడంతో కొఠారుల్లోని పంట మడులు, ఎడ మడులు, గంజేర్ల కట్టలు బాగా కరిగాయి. వాటిని బాగు చేయాలంటే ఖర్చులు రెట్టింపవుతాయని అంటున్నారు. చినగంజాం మండల పరిధిలో ప్రభుత్వ, ప్రైవేటు పరంగా సుమారు అయిదు వేల ఎకరాల్లో ఉప్పు సాగు ఉంది. కట్టల దెబ్బతిన్న పరిస్థితిని అధికారులు పరిశీలించి, న్యాయం జరిగేలా చూడాలని కోరుతున్నారు.

హార్బర్‌లో మూడో నంబరు ప్రమాద హెచ్చరిక



నిజాంపట్నం, న్యూస్‌టుడే: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం నెల్లూరు జిల్లాలో తీరం దాటినా దాని ప్రభావం కొనసాగుతుండడంతో హార్బర్‌లో మూడో నంబరు ప్రమాద సూచిక ఎగురవేసినట్లు పోర్టు కన్జర్వేటర్ మోకా వెంకట రామారావు తెలిపారు. హార్బర్‌లో ఎక్కడి బోట్లు అక్కడే జెట్టీపై ఆగాయని తెలిపారు. మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.


అద్దంకి మండలం పేరాయపాలెం వద్ద ఉద్ధృతంగా దోర్నపు వాగు


అద్దంకి : తిమ్మాయపాలెం వద్ద నీటిలో నానుతున్న పంట

అలుపెరగని పోరు





ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో 35 సౌత్‌జోన్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. క్రీడాకారులు వివిధ క్రీడాంశాల్లో తమ నైపుణ్యాన్ని ప్రదర్శించారు. హైజంప్, హర్డిల్స్‌లో క్రీడాకారిణుల విన్యాసాలు - ఎ.ఎన్.యు, న్యూస్‌టుడే

పంచాయతీల బలోపేతమే ప్రభుత్వ లక్ష్యం: మంత్రి గొట్టిపాటి

అద్దంకి, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లోనే అద్దంకి నియోజకవర్గానికి రూ.20 కోట్లు కేటాయించి అభివృద్ధి పనులను పరుగులు పెట్టిస్తున్నట్లు రాష్ట్ర విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మండలంలోని మోదేపల్లిలో పల్లెపండగ - గ్రామ పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా రూ.30 లక్షలతో నిర్మించనున్న సిమెంటు రహదారులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఎస్సీ కాలనీలో జరిగిన సభకు ఎంపీడీవో బి.సింగయ్య అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ పంచాయతీలను బలోపేతం చేసేందుకు 15వ ఆర్థిక సంఘం నిధులను నేరుగా వాటికే బదలాయించామన్నారు. జిల్లాలో రూ.150 కోట్ల అంచనాతో అభివృద్ధి పనులు జరుగుతున్నట్లు చెప్పారు. 3500 కి.మీ. సిమెంటు రహదారులు, గోకులం షెడ్లు నిర్మిస్తున్నామన్నారు. వైకాపా ప్రభుత్వంలో పంచాతీయలను నిర్వీర్యం చేశారన్నారు. పంచాయతీ నిధులతో పాటు కేంద్రం అందించిన నిధుల్ని దారి మళ్లించారన్నారు. వారి చర్యల కారణంగా ఎందుకు గెలిచామా అని నిరాశలో సర్పంచులు ఉండిపోయారన్నారు.


మోదేపల్లి సభలో మాట్లాడుతున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

పిడుగులతో బెంబేలు

భగవాన్‌రాజుపాలెం(జే పంగులూరు), న్యూస్‌టుడే: మండలంలోని భగవాన్‌రాజుపాలెంలో గురువారం పిడుగులు పడ్డాయి. ఉదయం ఎనిమిది గంటల సమయంలో గ్రామంపై ఐదు పిడుగులు పడటంతో సుమారు 50 ఇళ్లలోని గృహోపకరణాలు, విద్యుత్తు పరికరాలు దెబ్బతిన్నాయి. గ్రామానికి చెందిన జాగర్లమూడి వెంకట్రావు మూడంతస్తుల ఇంటిపై రెండు పిడుగులు పడ్డాయి. ఉపరితలంలోని మంచినీటి తొట్టెపై పడటంతో అది ధ్వంసమైంది. ఇంట్లోని పంకాలు, ఇన్వర్టరు, నిఘ కెమెరాలు, విద్యుత్తు మీటర్లు, ప్యానల్‌బోర్డులు దెబ్బతిన్నాయి. పిడుగులు పడిన సమయంలో కుటుంబ సభ్యులంతా ఇంట్లోనే ఉన్నారు. పిడుగులు నీళ్ల తొట్టెలో పడటంతో ప్రమాదం తప్పిందని వెంకట్రావు 'న్యూస్‌టుడే'కు తెలిపారు. సుమారు రూ.1.50 లక్షల విలువైన పరికరాలు దెబ్బతిన్నట్లు వెల్లడించారు.

> భగవాన్‌రాజుపాలెంలో 50 ఇళ్లలో దెబ్బతిన్న గృహోపకరణాలు


ఓ ఇంటి పైభాగంలో దెబ్బతిన్న నీళ్ల ట్యాంక్

చెత్త సంపద కేంద్రాలతో కాలుష్య నియంత్రణ

బాపట్ల, న్యూస్‌టుడే: పురపాలక సంఘాల్లో చెత్త సంపద కేంద్రాల ఏర్పాటుతో కాలుష్య నియంత్రణ సాధ్యమని కలెక్టర్ జె.వెంకట మురళి అన్నారు. చెత్త సంపద కేంద్రాల ఏర్పాటుపై కలెక్టరేట్లో అధికారులతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చెత్త సంపద కేంద్రాల కోసం అవసరమైన భూములను అధికారులు సేకరించాలన్నారు. జిల్లాలో నాలుగు పట్టణాల్లో తొమ్మిది నీటి శుద్ధి ప్లాంట్లు ఏర్పాటు చేయాలన్నారు. బాపట్ల, చీరాల పురపాలక సంఘంలో ఒక్కో నీటి శుద్ధి ప్లాంట్ ఏర్పాటుకు ప్రభుత్వ భూమి అందుబాటులో ఉందన్నారు. మిగిలిన ఏడు కేంద్రాలకు 14.82 ఎకరాల భూమి అవసరమన్నారు. బాపట్ల పట్టణంలో రెండు ప్లాంట్ల కోసం 3.50 ఎకరాల భూమి సేకరించాలని పేర్కొన్నారు. చీరాలలో ఓ ప్లాంటుకు రెండెకరాలు, రేపల్లెలో రెండు ప్లాంట్ల కోసం 4.89 ఎకరాలు, అద్దంకిలో రెండు కేంద్రాల కోసం 4.50 ఎకరాల భూమి కావాల్సి ఉందన్నారు. చెత్త సంపద కేంద్రాల ద్వారా పారిశుద్ధ్యం మెరుగుపడి పర్యావరణాన్ని పరిశుభ్రంగా ఉంచవచ్చన్నారు. జేసీ ప్రఖర్‌జైన్, డీఆర్వో సత్తిబాబు, ఆర్డీవో గ్లోరియా, పురపాలక కమిషనర్ రఘునాథరెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట మురళి, చిత్రంలో జేసీ ప్రఖర్‌జైన్

300 బస్తాల చౌక బియ్యం నూకలు స్వాధీనం

కొల్లిపర, న్యూస్‌టుడే: మండలంలోని అత్తోటలో గురువారం అక్రమంగా చౌక బియ్యం తరలిస్తున్నారన్న సమాచారం మేరకు కొల్లిపర ఎస్ఐ పి.కోటేశ్వరరావు, సిబ్బంది గ్రామానికి చేరుకొని ఆటోను అదుపులోకి తీసుకుని పరిశీలించారు. గోతాల్లో నూకలు ఉన్నట్టు గుర్తించి సరుకు తీసుకున్న గోదామను తనిఖీ చేయగా.. 300 నూకల మూటలున్నాయి. పోలీసుల సమాచారం మేరకు సివిల్ సప్లయిస్ రెవెన్యూ ఇన్‌స్పెక్టరు జాన్ అక్కడి నిల్వలను పరిశీలించి చౌకబియ్యం నూకలుగా మార్చినట్టు గుర్తించారు. గోదాము యజమాని సింగంశెట్టి శంకరరావు నుంచి వివరాలు తీసుకున్నారు. నమూనాలను ల్యాబ్‌కు పంపిస్తామని, రిపోర్టులు వచ్చిన తరవాత తదుపరి చర్యలు చేపడతామని అధికారులు పేర్కొన్నారు. నూకలమూటలు తరలిస్తున్న తన్నీరు శ్రీనివాసరావును అదుపులోకి తీసుకున్నామని. ఆటోను, నూకలను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషనుకు తరలించామని ఎస్ఐ చెప్పారు. ఏఎస్ఐ పోతురాజు, నాగబాబు, వీఆర్వో బాషా పాల్గొన్నారు.


ఆటోను అదుపులోకి తీసుకున్న పోలీసులు

డీఎస్సీ శిక్షణకు సంస్థల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు, న్యూస్‌టుడే: రాష్ట్ర సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో డీఎస్సీకి హాజరయ్యే ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచితంగా రెసిడెన్షియల్ విధానంలో ఉచితంగా శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించడంతో శిక్షణ సంస్థల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకుడు డి.మధుసూదన్‌రావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకునే సంస్థలు గత రెండు డీఎస్సీ రిక్రూట్‌మెంట్లకు శిక్షణ ఇచ్చి కనీసం 100 మంది అభ్యర్థులు ఉపాధ్యాయులుగా ఉద్యోగాలు పొంది ఉండాలన్నారు. దరఖాస్తులను https://tender.apeprocurement.gov.in లో ఈనెల 21 లోపు అప్‌లోడ్ చేయాలని కోరారు.

112 మద్యం దుకాణాలు ప్రారంభం

బాపట్ల, న్యూస్‌టుడే: జిల్లాలో గురువారం రాత్రికి 112 మద్యం దుకాణాలు ప్రారంభమయ్యాయి. మరో అయిదు దుకాణాలు తెరుచుకోలేదు. తొలి రోజు బుధవారం 30 దుకాణాలు తెరుచుకోగా, గురువారం ఉదయానికి 97 దుకాణాల్లో మద్యం విక్రయాలు ప్రారంభించారు. సాంకేతిక సమస్యల వల్ల డిపో నుంచి మద్యం కేసులు రాకపోవటంతో అయిదు దుకాణాలు ప్రారంభం కాలేదు. ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు జిల్లా సూపరింటెండెంట్ దేవదత్తుకు ఫోన్ చేసి మద్యం దుకాణాలు ఎన్ని ప్రారంభం అయ్యాయి. దుకాణాలు తెరుచుకోకపోవడానికి కారణాలేమిటని ఆరా తీశారు. బాపట్ల పట్టణంలో ఏడు, మండలంలో నాలుగు, పిట్టలవానిపాలెం మండలంలో నాలుగు, కర్లపాలెం మండలంలో నాలుగు దుకాణాలకు గాను మూడు తెరుచుకున్నాయి. తాత్కాలికంగానైనా దుకాణాలు తెరిచి మద్యం విక్రయాలు ప్రారంభించాలని లైసెన్స్‌దారులను ఎక్సైజ్ అధికారులు ఆదేశించారు. పలుచోట్ల ఇళ్ల మధ్య మద్యం దుకాణాలు ఏర్పాటు చేయడం తగదంటూ స్థానికులు ఆందోళనకు దిగారు.

పొదుపు సంఘాలకు రుణాలు

చీరాల గ్రామీణం, న్యూస్‌టుడే: మహిళలు స్వయం సంవృద్ధి చెందడానికి పొదుపు సంఘాలకు విరివిగా రుణాలు అందించనున్నట్లు డీఆర్‌డీఏ పీడీ పద్మజ పేర్కొన్నారు. చీరాల మండల పరిషత్ సమావేశ హాలులో గురువారం డీఆర్‌డీఏ అధికారులు, బ్యాంకర్ల సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. మహిళలను లక్షాధికారులను చేయాలనే లక్ష్యంతో పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించిన సంఘాలకు సున్నా వడ్డీ పథకాన్ని అమలు చేసి లబ్ధి చేకూర్చనున్నట్లు పేర్కొన్నారు. ఎస్‌బీఐ డీజీఎం హేమ, ఏజీఎం లలిత మాట్లాడుతూ.. తీసుకున్న రుణాలను పలు స్వయం ఉపాధి యూనిట్ల కోసం పెట్టుబడిగా పెట్టి ఆదాయం పొందాలన్నారు. ఆర్థిక క్రమ శిక్షణ పాటించి వ్యాపారం చేస్తే సులభంగా రుణాలు చెల్లించడమే కాకుండా.. కుటుంబానికి, సమాజానికి ఉపయోగపడతారన్నారు. కార్యక్రమంలో ఒంగోలు, తెనాలి ఆర్ఎంలు గున్నేశ్వరరావు, జగదీష్‌రావు, బాపట్ల, చీరాల, ఒంగోలు చీఫ్ మేనేజర్లు వెలుగు ఏపీ, ఏపీఎం, సీసీలు పాల్గొన్నారు.

అసైన్డ్ రైతులకు కౌలు జమ

- తొలి విడతగా రూ. 22.03 కోట్లు
- వైకాపా హయాంలో మూడేళ్ల పాటు పెండింగ్

ఈనాడు – అమరావతి



రాజధానిలోని అసైన్డ్ రైతుల బ్యాంకు ఖాతాల్లో వార్షిక కౌలు జమైంది. సీఐడీ క్లియరెన్సు ఇచ్చిన రైతుల వివరాలు పరిశీలించి.. ఇప్పటికే సీఆర్డీఏ అధికారులు సీఎఫ్ఎంఎస్ లోకి బిల్లులను అప్‌లోడ్ చేశారు. గత మూడేళ్లుగా వైకాపా సర్కారు కారణంగా కౌలు రాక ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితుల్లో మూడేళ్ల కౌలు పడడంతో ఊరట లభించింది. సీఐడీ విచారణ పేరుతో జగన్ ప్రభుత్వం అసైన్డ్ రైతులకు కౌలు నిలిపేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు.. అసైన్డ్ రైతుల సమస్యలను పరిష్కరించాలని సీఆర్డీఏ అధికారులకు ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా మొదటి విడతలో ఇటీవల పలువురు అర్హులను గుర్తించి వారికి మంజూరు చేశారు. మిగిలిన వాటిని కూడా పరిశీలించి వచ్చే రెండు, మూడు నెలల్లో పరిష్కరించి న్యాయం చేయాలన్న పట్టుదలతో ఉన్నట్లు సీఆర్డీఏ కమిషనర్ కాటంనేని భాస్కర్ తెలిపారు.

మూడేళ్లు నరకం అనుభవించారు

రాజధానిలో భూముల విషయంలో కుంభకోణం జరిగిందని వైకాపా ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ఫిర్యాదు మేరకు సీఐడీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టింది. 2014 - 19 మధ్య కాలంలో జరిగిన అసైన్డ్ భూముల లావాదేవీలపై విచారణ చేస్తోంది. ఈ నేపథ్యంలో అప్పటి వైకాపా ప్రభుత్వం 2021 నుంచి అసైన్డ్ రైతులకు కౌలు నిలిపేసింది. రాజధాని నిర్మాణం కోసం సమీకరణ కింద వచ్చిన భూముల్లో ఆరు విభాగాలకు చెందిన 3 వేల మందికి సంబంధించి 2,689.14 ఎకరాల మేర అసైన్డ్ భూములున్నాయి. దర్యాప్తు ఇప్పటికే చాలా వరకు పూర్తయినా, మళ్లీ సీఐడీ అధికారులు తిరగదోడారు. దీనివల్ల జగన్ హయాంలో ఎస్సీ రైతులకు జీవనాధారం కరవైంది. కౌలు ఎప్పుడు వేస్తారోనని కళ్లల్లో ఒత్తులు వేసుకుని ఎదురుచూశారు. 3,139 మంది అసైన్డ్ రైతుల్లో కౌలుకు అర్హులంటూ 2,472 మందిని గుర్తించారు. వారికీ కూడా కౌలు ఇవ్వకుండా ప్రభుత్వం పక్కన పెట్టేసింది.

1,234 రైతులకు మంజూరు

సమస్యలు లేని అసలు పత్రాలతో సరిపోలిన 1,479 అసైన్డ్ రైతుల వివరాలను గుంటూరు కలెక్టర్ కార్యాలయం నుంచి సీఆర్డీఏ సేకరించింది. అధికారులు అన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించి 1, 2, 3 కేటగిరీల్లో వివాదాల్లేని 1,328.17 ఎకరాలకు సంబంధించి 1,234 మంది అసైన్డ్ రైతులను అర్హులుగా గుర్తించారు. వీరిని కౌలు చెల్లింపునకు అర్హులుగా గుర్తించి, జమ చేస్తున్నట్లు సీఐడీ, గుంటూరు కలెక్టర్, ప్రభుత్వానికి సీఆర్డీఏ అధికారులు సమాచారం ఇచ్చారు. వారి నుంచి ఎన్వోసీలు తీసుకున్నారు. వీరికి సంబంధించి రూ. 22.03 కోట్లకు బిల్లులను ఇటీవల సీఎఫ్ఎంఎస్‌లోకి అప్‌లోడ్ చేశారు. ఇది ఆర్థిక శాఖ ఆమోదం లభించడంతో రైతుల ఖాతాల్లో జమయ్యాయి. సీఐడీ అధికారులు తిరస్కరించిన జాబితాలో ఉన్న మిగిలిన వాటిని కూడా త్వరితగతిన పరిష్కరించేందుకు సీఆర్డీఏ అధికారులు చర్యలు ప్రారంభించారు. ఇవి రెండు, మూడు నెలల్లో కొలిక్కి వచ్చే అవకాశం ఉంది.

మినుము రైతు విలవిల


మినుము పంటను పరిశీలిస్తున్న రైతులు

బైటమంజులూరు(జే పంగులూరు), న్యూస్‌టుడే: అధిక వర్షాల కారణంగా మినుము పంట సాగుచేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రధానంగా జిల్లాలోని జే పంగులూరు, ఇంకొల్లు, మార్టూరు మండలాల్లో సుమారు 3400 ఎకరాల్లో మినుము సాగు చేయగా అధిక వర్షాల కారణంగా సుమారు 2400 ఎకరాల్లో నష్టం సంభవించింది. జే పంగులూరు మండలం బైటమంజులూరు, అలవలపాడు, కోటపాడు, రేణంగివరం, కొండమూరు, జే పంగులూరు, జనకవరం, చందలూరు, నూజెళ్లపల్లి, ఇంకొల్లు, మార్టూరు మండలం ద్రోణాదుల తదితర గ్రామాల్లో కోసిన మినుము ఓదెల్లో నుంచి మొలకలు వచ్చాయి. అలాగే లేత మినుముకు పూత రాలింది. ఎకరాకు సరాసరిన రూ.20 వేల వరకు పెట్టుబడి అయిందని, ఇపుడు ఏం చేయాలో అర్థం కాకుండా ఉందని రైతులు వాపోతున్నారు. బైటమంజులూరులో పర్యటించిన ఏవో డి.సుబ్బారెడ్డి రైతులతో మాట్లాడారు. కోతకు వచ్చిన మినుములు అక్కడక్కడ మొలకలు వచ్చినట్లు గుర్తించామన్నారు. మొలకలు రాకుండా ఉండాలంటే రెండుశాతం ఉప్పు ద్రావణం పంటపై పిచికారీ చేయడం వల్ల విత్తనం నీటిని గ్రహించే సామర్థ్యాన్ని తగ్గిస్తుందన్నారు. విత్తనంలో అయాన్ అసమతుల్యతను కలిగిస్తుందని ఏవో వివరించారు. చివరకు అంకురోత్పత్తిని నిరోధిస్తుందని రైతులు దీన్ని పాటించాలని సూచించారు.


బైటమంజులూరులో మొలకెత్తిన మినుము పంట

మాస్టర్‌మైండ్స్ విద్యార్థినికి సీఎం అభినందన

నగరపాలక సంస్థ (గుంటూరు), న్యూస్‌టుడే: గతంలో విడుదలైన ఆలిండియా సీఎంఏ ఫైనల్ ఫలితాల్లో మొదటి ర్యాంకు సాధించిన మాస్టర్ మైండ్స్ విద్యార్థిని కొత్తపేట తేజస్వినిని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్ర సచివాలయంలోని ఆయన ఛాంబర్‌లో అభినందించారు. ఈ సందర్భంగా మాస్టర్‌మైండ్స్ యాజమాన్యం, సిబ్బందికి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబును కలిసిన విద్యా సంస్థల అడ్మిన్ అడ్వైజర్ మట్టుపల్లి మోహన్ ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.7 లక్షలు డీడీని వరదబాధితుల సహాయార్థం అందజేశారు.


తేజస్వినిని అభినందిస్తున్న సీఎం చంద్రబాబు, చిత్రంలో మాస్టర్‌మైండ్స్ అడ్మిన్ అడ్వైజర్ మట్టుపల్లి మోహన్

మా కొద్దు ఈ మద్యం దుకాణం

వేటపాలెం, న్యూస్‌టుడే: ఓవైపు దేవాలయం, మరోవైపు అల్పాదాయ వర్గాలు నివసించే ప్రాంతంలో మాకొద్దు ఈ మద్యం దుకాణం అంటూ మహిళలు నిరసనకు దిగారు. ఈ ఘటన ఇస్లాంపేటలో గురువారం చోటుచేసుకుంది. వేటపాలెం సెంటరు నుంచి బైపాస్ రోడ్డుకు వెళ్లే దారిలో ఉన్న చిన్నమందిర సమీపంలోని ఇస్లాంపేటలో మద్యం దుకాణం ఏర్పాటుకు నిర్వాహకులు ప్రయత్నాలు ప్రారంభించారు. విషయం తెలియడంతో ఆప్రాంత మహిళలు ఆందోళనకు దిగారు. ఇప్పటికే ఈ రహదారిపై నిత్యం పలు సంఖ్యలో వాహనాలు తిరుగుతున్నాయి. ఎప్పుడు ఏం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నాం. ఇప్పుడు ఏకంగా మద్యం దుకాణం పెడితే ఎలాగని వారు ప్రశ్నిస్తున్నారు. ఎటువంటి పరిస్థితుల్లో ఇక్కడ దీన్ని పెట్టవద్దని భీష్మించుకున్నారు. దీనిపై బుధవారం రాత్రి ఆప్రాంతవాసులు నిరసనకు దిగడం గమనార్హం. సమస్యను స్థానిక నాయకులు కొందరు ఎమ్మెల్యే కొండయ్యను కలిసి విన్నవించడంతో ఎక్సైజ్‌శాఖ అధికారులతో మాట్లాడి ఇబ్బందులకు తావులేకుండా చూస్తామని వారికి హామీ ఇచ్చారు. విషయం తెలుసుకున్న గ్రామీణ సీఐ ఎ.శేషగిరిరావు ఘటనా స్థలానికి చేరుకుని స్థానికులతో మాట్లాడారు. దీనిపై కలెక్టరుకు వినతిపత్రం అందజేయాలని వారికి సూచించారు. అప్పటి వరకు దుకాణం తెరవవద్దని హామీ ఇవ్వడంతో ఆందోళనకారులు అక్కడ నుంచి వెళ్లిపోయారు. వేటపాలెం, ఈపూరుపాలెం ఎస్సైలు మీసాల వెంకటేశ్వర్లు, శివకుమార్ ఉన్నారు.


ఆందోళన చేస్తున్న ముస్లిం మహిళలు

పట్టభద్రుల ఓటు నమోదు కేంద్రం ప్రారంభం

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: ప్రజాగొంతుకగా నిలిచే పీడీఎఫ్ ఉమ్మడి అభ్యర్థులను బలపర్చాలని యూటీఎఫ్ నేత టీయూ బాపట్ల జిల్లా కార్యదర్శులు ఎంవీ సుబ్రహ్మణ్యం, సీహెచ్ మణిలాల్ పిలుపునిచ్చారు. ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికల నేపథ్యంలో రేపల్లె యూటీఎఫ్ కార్యాలయంలో ఓటరు నమోదు కేంద్రాన్ని గురువారం ప్రారంభించి మాట్లాడారు. యూటీఎఫ్ కార్యాలయంలో నవంబరు 6 వరకు రోజూ సాయంత్రం 5 నుంచి రాత్రి 8 గంటల వరకు ఉచితంగా ఓటు నమోదు చేస్తారన్నారు. దీన్ని అర్హులైన పట్టభద్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 8099277623, 9177075876 నంబర్లలో సంప్రదించాలన్నారు. నాయకులు రవీంద్ర, రాజభూషణం, సుబ్బారావు, రత్నరాజు, ఆశీర్వాదం, రమేష్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


నమోదు ప్రక్రియ వివరిస్తున్న సుబ్రహ్మణ్యం

వేటసాగక.. పూటగడవక

అవస్థల్లో మత్స్యకారులు

చీరాల, చీరాల గ్రామీణం, న్యూస్‌టుడే

సంద్రాన్నే నమ్ముకుని బతుకు నావ నెట్టుకొస్తున్న గంగపుత్రుల పరిస్థితి గోరువట్టుపై రోకటిపోటులా మారింది. జూన్ 14 నుంచి వేట పునః ప్రారంభమైన నాటి నుంచి వీరికి కలిసి రావడం లేదు. చేపలు సరిగ్గా చిక్కక నాలుగు నెలలుగా అవస్థలు పడుతుంటే ప్రస్తుతం వారం రోజులుగా వాయుగుండం కారణంగా వేట పూర్తిగా నిలిచిపోయింది. మరో వృత్తి తెలియని గంగపుత్రులు అప్పులతో కుటుంబాలను పోషించుకుంటున్నారు.

జిల్లాలో 74 కిలోమీటర్ల మేర తీరం విస్తరించి ఉంది. మొత్తం 232 పెద్దబోట్లు, 2431 మధ్యతరహా బోట్లు, 249 నాటు పడవలు ఉన్నాయి. ఈ బోట్ల యజమానుల వద్ద పది వేల మందికి పైగా కలాశీలు పనిచేస్తున్నారు. వీరిలో అధిక శాతం మంది వలస వచ్చిన వారే. తీరం వెంబడి గ్రామాల్లో గంగమ్మను నమ్ముకొని మత్స్యకార కుటుంబాలు జీవిస్తున్నాయి. సముద్రం ప్రశాంతంగా ఉంటేనే వేటకు వెళ్లగలిగేది... కుటుంబ పోషణ.. లేకుంటే పస్తులుండాల్సిందే. ప్రస్తుతం చేపల వేట అస్థిరంగా ఉండటంతో కుటుంబ పోషణకు యజమానుల వద్ద రుణాలు తీసుకుంటున్నారు. ఒక్కొక్కరికి రూ.లక్ష నుంచి రూ. మూడు లక్షల వరకు బాకీలు ఉన్నట్లు కొందరు కలాశీలు చెబుతున్నారు. బోటులో సముద్రంలోకి వెళితే వచ్చిన ఆదాయంలో కొంత అప్పునకు జమ చేసి, మరికొంత కుటుంబ పోషణకు వినియోగిస్తున్నారు. అక్టోబరు నుంచి వేటకు మంచి సీజన్. ఈ రోజుల్లో సరకు బాగా పడుతుంది. మిగిలిన సంవత్సరం నామమాత్రంగా వేట సాగినా ఈ కాలంలో లభించే సరకుతో మత్స్యకారుల ఇబ్బందులు తీరతాయి. ఈసారి ప్రకృతి ప్రకోపించటంతో వారి ఆశలు తలకిందులయ్యే పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికే ఇంధనంతోపాటు ఇతర ఖర్చులు రెట్టింపయ్యాయి. ఈ పరిస్థితుల్లో అన్ని వర్గాలను ఆదుకున్నట్లు తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.



ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్

రక్షణ లేని బోట్లు

వాయుగుండం, తుపాన్ల సమయాల్లో బోట్లకు రక్షణ ఉండటం లేదు. ముఖ్యంగా వాడరేవులో 700 ఎంసీల్, 30 ఎంఎఫ్‌వీ బోట్లు ఉన్నా.. హార్బర్ సౌకర్యం లేక వాటిని నిలపడానికి ఇబ్బందిగా ఉంది. సముద్రంలో నుంచి అతి కష్టం మీద ఈపూరుపాలెం స్ట్రయిట్‌కట్‌లోకి తీసుకువచ్చి, వంతెన వద్ద లంగరు వేస్తున్నారు. కొందరు ఈ బాధ పడలేక తీరానికి తెచ్చి పెడుతున్నారు. దీంతో బోట్లు దెబ్బతింటున్నాయి. పెద్ద బోట్లను నిజాంపట్నం వరకు తీసుకెళ్లి అక్కడ హార్బర్‌లో నిలుపుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇక్కడ ఒక్కచోటే హార్బర్ ఉండటంతో అందరికీ చోటు లభించడం లేదు. ఈ సమస్య నివారణకు వాడరేవు వద్ద మంజూరైన హార్బర్ నిర్మాణ పనులు మొదలు పెట్టాలని మత్స్యకారులు కోరుతున్నారు.

ప్రభుత్వం చొరవ చూపాలి: బాబ్జి



వరుస తుపాన్ల నేపథ్యంలో వేట సాగక అనేక ఇబ్బందులు పడుతున్నాం. వేట మినహా మరే వృత్తి చేతకాని మమ్మల్ని ప్రభుత్వం ఆదుకోవాలి. తుపాను సమయంలో నష్టపోయిన మిగిలిన వర్గాలకు ఏవిధంగా న్యాయం చేస్తున్నారో అలాగే మాకు న్యాయం చేయాలి.

అప్పుల పాలవుతున్నాం: సురేష్



తరచూ వేట నిలిచిపోవటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. గత్యంతరం లేని పరిస్థితుల్లో అప్పులు చేసి కుటుంబాలను పోషించుకుంటున్నాం. మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక తయారు చేయాలి.

మానవ అక్రమ రవాణా అరికట్టాలి

బాపట్ల, న్యూస్‌టుడే: మానవ అక్రమ రవాణాను అరికట్టడలో స్వచ్ఛంద సంస్థలు తమ వంతు పాత్ర పోషించాలని కలెక్టర్ జె.వెంకట మురళి అన్నారు. గ్రామీణ సాంఘిక విమోచన సేవా సంస్థ(రోజ్) ఆధ్వర్యంలో మానవ అక్రమ రవాణా విముక్తి కోసం ప్రచురించిన కరపత్రాలను కలెక్టరేట్లో ఆయన గురువారం ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ వృద్ధుల సంక్షేమానికి స్వచ్ఛంద సంస్థలతో కలిసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలు చేపడుతున్నాయన్నారు. విద్యార్థినులు, బాలికలకు మంచి, చెడు స్పర్శలపై అవగాహన కల్పించాలన్నారు. డీఎస్‌డబ్ల్యూవో రాజా దెబోరా, రోజ్ సంస్థ కార్యదర్శి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య విలువలు కాపాడే ప్రభుత్వం

వేమూరు, న్యూస్‌టుడే: ప్రజాస్వామ్య విలువలు కాపాడే ప్రభుత్వం తెదేపానేనని ఎమ్మెల్యే ఆనందబాబు అన్నారు. వివిధ అభివృద్ధి కార్యక్రమాల భూమిపూజ కోసం గురువారం వేమూరు వచ్చారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ వైకాపా అధికారంలో ఉన్నప్పుడు ఆ పార్టీ నాయకులు రాజ్యాంగాన్ని తుంగలో తొక్కి ప్రతిపక్ష పార్టీల నాయకులను వేధింపులకు గురి చేశారని ఆరోపించారు. ప్రజలను సైతం భయభ్రాంతులను చేశారని విమర్శించారు. తెదేపా కార్యాలయంపై దాడి, ముఖ్యమంత్రి చంద్రబాబు ఇంటిపై దాడి చేసిన వారికి చట్టబద్ధంగా నోటీసులు ఇచ్చి, పోలీస్ స్టేషన్‌కు పిలిపించారని ఎమ్మెల్యే చెప్పారు. దీనిలో భాగంగానే వైకాపా నేత సజ్జల రామకృష్ణారెడ్డికి నోటీసులు ఇచ్చి పోలీస్ స్టేషన్‌కు రమ్మన్నారన్నారు. వైకాపా హయాంలో మాదిరి అడ్డగోలుగా తప్పుడు కేసులు నమోదు చేయించి ఎవరినీ ఇబ్బంది పెట్టలేదని చెప్పారు.

వెయ్యికి పైగా మద్యం సీసాలు ధ్వంసం


బాపట్లలో రోడ్డుపై పేర్చిన సీసాలు

బాపట్ల, న్యూస్‌టుడే: పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో అక్రమంగా నిల్వ చేసి 49 కేసుల్లో పట్టుబడిన వెయ్యి సీసాల మద్యం, 15 లీటర్ల సారాను డీఎస్పీ రామాంజనేయులు పర్యవేక్షణలో గురువారం ధ్వంసం చేశారు. పురపాలక డంపింగ్ యార్డు వద్ద రోడ్డుపై మద్యం సీసాలు పేర్చి పొక్లెయిన్‌తో తొక్కించి ధ్వంసం చేయించారు. డీఎస్పీ మాట్లాడుతూ అక్రమంగా మద్యం నిల్వ చేసినా, విక్రయించినా చట్టప్రకారం శిక్ష తప్పదని హెచ్చరించారు. పట్టణ సీఐ అహ్మద్ జానీ, ఎస్సై విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

చందోలు(పిట్టలవానిపాలెం): చందోలు పోలీస్‌స్టేషన్ పరిధిలో 27 కేసుల్లో స్వాధీనం చేసుకున్న 222 సీసాల మద్యాన్ని డీఎస్పీ జి.రామాంజనేయులు పర్యవేక్షణలో గురువారం ధ్వంసం చేశారు. మండలంలో మద్యం దుకాణాల్లో మాత్రమే మద్యం అమ్మకాలు జరగాలని, గొలుసు దుకాణాలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సీఐ హరికృష్ణ, ఎస్సై శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

దుర్గాదేవి నగరోత్సవం అడ్డగించిన వైకాపా మండలాధ్యక్షుడు


❑ తన వీధిలో నుంచి వెళ్లటానికి వీల్లేదని హుకుం ❑ అనుచరుల సాయంతో ఉత్సవ నిర్వాహకులపై దాడి

తొమ్మిది మందిపై కేసు నమోదు


ఫిర్యాదు చేయటానికి పట్టణ పోలీస్‌స్టేషన్ వద్దకు వచ్చిన దరివాదకొత్తపాలెం వాసులు

బాపట్ల, న్యూస్‌టుడే: పట్టణంలోని దరివాదకొత్తపాలెంలో దుర్గాదేవి విగ్రహ నగరోత్సవాన్ని వైకాపా మండలాధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి గురువారం తెల్లవారుజామున అడ్డుకున్నాడు. నిర్వాహకుల కథనం మేరకు దసరా సందర్భంగా వార్డులో స్థానికులు అమ్మవారి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా అమ్మవారి విగ్రహంతో నగరోత్సం చేస్తూ రాఘవరెడ్డి ఇంటి వైపు వెళ్లారు. తన ఇల్లు ఉన్న వీధిలోకి అమ్మవారి విగ్రహంతో నగరోత్సవం నిర్వహించరాదని అనుచరులతో కలిసి వైకాపా మండలాధ్యక్షుడు అడ్డుకున్నాడు. డీజే బాక్సుల వైర్లు పీకి నిర్వాహకుడిపై దాడికి పాల్పడ్డారు. సమాచారం అందుకున్న పట్టణ సీఐ అహ్మద్‌జానీ పోలీసు సిబ్బందితో కలిసి ఘటనాస్థలానికి చేరుకుని ఇరు వర్గాలు ఘర్షణ పడకుండా బందోబస్తు నిర్వహించి అమ్మవారి నగరోత్సవం కొనసాగేలా చర్యలు తీసుకున్నారు. దరివాదకొత్తపాలెం మహిళలు, ఉత్సవ నిర్వాహకులు గురువారం మధ్యాహ్నం పట్టణ పోలీస్‌స్టేషన్ వద్దకు వచ్చి రాఘవరెడ్డి అమ్మవారి నగరోత్సవాన్ని అడ్డుకుని తన అనుచరులతో దాడి చేయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణ సీఐ, పోలీసులు రాకుంటే తమను కూడా కొట్టేవారని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. రాఘవరెడ్డి అనుచరుల దాడిలో ఓ యువకుడు గాయపడ్డాడని తెలిపారు. రాఘవరెడ్డిపై కేసు నమోదు చేసి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతూ పట్టణ సీఐ అహ్మద్ జానీని కలిసి ఫిర్యాదు చేశారు. వైకాపా మండలాధ్యక్షుడు తమపై దాడులు చేయిస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నాడని, అతని నుంచి రక్షణ కల్పించాలని కోరారు. తమపై దాడులు చేయటానికి ముందస్తు ప్రణాళిక మేరకు బయట నుంచి వ్యక్తులను రప్పించి కర్రలు సిద్ధం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. సీఐ మాట్లాడుతూ ఫిర్యాదు స్వీకరించామని విచారించి తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. ఉత్సవ నిర్వాహకులపై దాడికి పాల్పడినట్లు నిందితులు రాఘవరెడ్డితో పాటు అతని అనుచరులు మరో ఎనిమిది మందితో కలిపి మొత్తం తొమ్మిది మందిపై పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

గుండెపోటుతో పీఆర్ ఎస్ఈ హఠాన్మరణం


హరే రామకృష్ణ (పాతచిత్రం)

బాపట్ల, మేదరమెట్ల, న్యూస్‌టుడే: జిల్లా పంచాయతీ రాజ్ ఎస్ఈ జాగర్లమూడి హరే రామకృష్ణ (61) గుండెపోటుతో కన్నుమూశారు. ఉదయం ఒంగోలులోని స్వగృహంలో యోగ సాధన చేస్తుండగా గుండెపోటుకు గురయ్యారు. కుటుంబసభ్యులు హుటాహుటిన ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆయన మరణించారు. పల్లె పండగ వారోత్సవాల్లో భాగంగా మూడ్రోజులుగా ఆయన జిల్లా వ్యాప్తంగా పర్యటిస్తూ మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి గ్రామాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన, భూమి పూజా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. భౌతికకాయాన్ని స్వగ్రామం కొరిశపాడు మండలం పమిడిపాడు తరలించగా రాష్ట్ర మంత్రి గొట్టిపాటి రవికుమార్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఎస్ఈ హఠాన్మరణంపై కలెక్టర్ జె.వెంకట మురళి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. భౌతికకాయాన్ని సందర్శించి, పూలమాల వేసి నివాళి అర్పించారు. పంచాయతీరాజ్ డీఈ రాజన్న, జేఈ మోహనరావు సంతాపం తెలిపిన వారిలో ఉన్నారు. తహసీల్దార్ జీవీ.సుబ్బారెడ్డి, ఎంపీడీవో రాజ్యలక్ష్మితో పాటు తెదేపా ఉమ్మడి ప్రకాశం జిల్లా ఉపాధ్యక్షుడు మన్నే రామారావు నివాళులర్పించారు. రాత్రి రామకృష్ణ భౌతికకాయానికి పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు నివాళులర్పించారు.


మృతదేహానికి నివాళులర్పిస్తున్న మంత్రి గొట్టిపాటి


కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటమురళి

ఇసుక తరలింపు అడ్డగింత


పెసర్లంక సమీపంలో కృష్ణానది నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు

కొల్లూరు, న్యూస్‌టుడే: మండల పరిధిలో గాజుల్లంక, పెసర్లంక సమీపంలో కృష్ణానదిలో ఇసుక నింపుకొనేందుకు చేరుకున్న ట్రాక్టర్లతో గురువారం సందడి వాతావరణం నెలకొంది. ఇసుక తరలించే ట్రాక్టర్లను కాపలా సిబ్బంది అడ్డుకోగా 'సొంత అవసరాలకు ఎడ్లబళ్లు, ట్రాక్టర్ల ద్వారా ఇసుక తీసుకెళ్లే వారిని అనుమతించాలని' స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారంటూ వాహన చోదకులు వారికి గుర్తు చేశారు. దీంతో వారు మిన్నకుండిపోయారు. కృష్ణానది నుంచి సుమారు వంద ట్రాక్టర్ల ఇసుక తరలి పోయింది. తెల్లవారుజామున ప్రారంభమైన ఇసుక రవాణాను ఉదయం 10గంటల ప్రాంతంలో ఎస్సై ఏడుకొండలు నేతృత్వంలో పోలీసులు అడ్డుకున్నారు. తమకు ఉన్నతాధికారుల నుంచి స్పష్టమైన ఆదేశాలు వచ్చే వరకు ఇసుక రవాణాను అనుమతించలేమని ఎస్సై చెప్పడంతో వాహనదారులు అసహనం వ్యక్తం చేశారు. దీంతో ఆగ్రహించిన ట్రాక్టర్ల యజమానులు శుక్రవారం పోలీసు స్టేషన్‌ను ముట్టడించేందుకు నిర్ణయించినట్లు తెలిపారు. ఈ విషయమై స్పందించిన తహసీల్దార్ వెంకటేశ్వర్లు ఉచిత ఇసుక పథకం అమలు విషయంలో ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని, ఇందుకు సంబంధించిన విధివిధానాల విషయంలో ఉన్నతాధికారులను సంప్రదించి వారి ఆదేశాల మేరకు నడుచుకుంటామని తెలిపారు. ఏది ఏమైనా ముఖ్యమంత్రి ప్రకటన ఆధారంగా ప్రారంభమైన ఇసుక తరలింపు వ్యవహారంతో ఏం చేయాలో పాలు పోని పరిస్థితుల్లో అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

రేషన్ బియ్యం పాలిష్ చేసి అక్రమ తరలింపు

ఇద్దరి అరెస్టు.. రూ.18 లక్షల సొత్తు స్వాధీనం: ఎస్పీ

నల్గొండ నేరవిభాగం, న్యూస్‌టుడే: రేషన్ బియ్యాన్ని మిల్లులో పాలిష్ చేసి అక్రమ రవాణా చేస్తున్న ఇద్దరు నిందితులను అరెస్టు చేయగా, ఒకరు పరారీలో ఉన్నట్లు నల్గొండ ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు. వారి నుంచి రూ.18 లక్షల విలువ చేసే 504.40 క్వింటాళ్ల రేషన్ బియ్యం, రెండు లారీలు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు.

◆ ఆంధ్రప్రదేశ్‌లోని బాపట్ల జిల్లా కేంద్రానికి చెందిన చీమకుర్తి సుధాకర్ కొన్నేళ్లుగా రైతుల నుంచి సేకరించిన ధాన్యంతో పాటు గుంటూరు, బాపట్ల, నర్సారావుపేటలో రేషన్ బియ్యం తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నాడు. ఆ బియ్యాన్ని స్థానికంగా ఉన్న మిల్లులో పాలిష్ వేయడంతో పాటు నకిలీ బిల్లులు తయారీ చేసి రూ.30 కిలోల చొప్పున నెలకు 10 నుంచి 12 లోడ్‌లను తెలంగాణ, కర్ణాటక, గుజరాత్, రాజస్థాన్ ప్రాంతాలకు అక్రమ రవాణా చేస్తున్నాడు. విశ్వసనీయ సమాచారంతో వాడపల్లి చెక్‌పోస్టు వద్ద తనిఖీలు చేస్తుండగా పట్టుబడిన లారీతో పాటు అతడిని అదుపులోకి తీసుకుని విచారణ చేయగా వాస్తవాలు ఒప్పుకున్నట్లు తెలిపారు.

◆ ఇదే క్రమంలో కర్ణాటక రాష్ట్రానికి చెందిన సయ్యద్ సలావుద్దిన్ అనే లారీ డ్రైవర్ గురువారం లోడు రేషన్ బియ్యంతో వెళుతుండగా పౌరసరఫరాలశాఖ అధికారులకు సమాచారం రావడంతో అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. గుంటూరు జిల్లా కేంద్రానికి చెందిన మరో నిందితుడు అశోక్ పరారీలో ఉన్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్ రాజు, రూరల్ సీఐ వీరబాబు పాల్గొన్నారు.

మతి స్థిమితం లేని వ్యక్తి హల్‌చల్

చీరాల, న్యూస్‌టుడే: స్థానిక విఠల్‌నగర్‌లో మతిస్థిమితం లేని వ్యక్తి హల్‌చల్ సృష్టించాడు. దీంతో మహిళలు భయాందోళనకు గురయ్యారు. స్థానికులు అందించిన వివరాల ప్రకారం.. విఠల్‌నగర్ ప్రాంతంలో జనావాసాల మధ్య గురువారం మధ్యాహ్నం గుర్తుతెలియని యువకుడు సరైన దుస్తులు లేకుండా, ఇళ్లపైకి ఎక్కి దూకుతూ అరుస్తూ కేకలు వేస్తూ హడావిడి చేశాడు. ఇతని చర్యలతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. దీంతో అక్కడ ఉన్న కొందరు అతడిని పట్టుకొనేందుకు ప్రయత్నించినా ప్రయోజనం లేకపోయింది. అర్థంకాని భాషలో మాట్లాడుతూ ఉండటంతో వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని యువకుడిని అతికష్టం మీద పట్టుకున్నారు. అతడెవరు, ఇక్కడకి ఎలా వచ్చాడు. అనే విషయాలపై ఆరా తీశారు.

జిమ్నాస్టిక్స్ పోటీలు ప్రారంభం

గుంటూరు క్రీడలు, న్యూస్‌టుడే: రాబోయే ఒలింపిక్స్‌లో జిమ్నాస్టిక్స్ విభాగంలో భారత్ స్వర్ణం సాధించే దిశగా అడుగులు వేయాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ పేర్కొన్నారు. గుంటూరు బ్రహ్మానంద రెడ్డి స్టేడియంలో రాష్ట్ర స్థాయి జిమ్నాస్టిక్స్ పోటీలను గురువారం ఆయన ప్రారంభించారు. సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాల్లో పోటీలు నిర్వహించగా. . పలు ప్రాంతాల నుంచి క్రీడాకారులు తరలివచ్చారు. ఈనెల 19వ తేదీ వరకు పోటీలు కొనసాగనున్నాయి. జిమ్నాస్టిక్స్ ఏపీ అధ్యక్షుడు ఆర్.పి.ఆర్.విఠల్, కార్యదర్శి సుబ్బారావు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 130, రిటైల్ ధర - 152, చికెన్ విత్‌స్కిన్ - 220, చికెన్ స్కిన్‌లెస్ - 251.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -130 రిటైల్ ధర 152 చికెన్ విత్ స్కిన్ - 220, చికెన్ స్కిన్‌లెస్ - 251.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 135, 144, 155 చికెన్ విత్ స్కిన్ - 260 చికెన్ స్కిన్‌లెస్ - 270.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 510 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.95/-.

బాపట్ల

•బాపట్ల •రేపల్లె •వేమూరు

మార్కెట్ పరిసరాలు శుభ్రం

ఈనాడు కథనానికి స్పందన

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: రేపల్లె పెద్ద కూరగాయల మార్కెట్‌కు వెళ్లాలంటే వినియోగదారులు భయపడుతున్నారు. మార్కెట్లో పోగయ్యే వ్యర్థాలు సక్రమంగా తొలగించకపోవడంతో పరిసరాలు దుర్వాసన వెదజల్లుతున్నాయి. దీంతో వినియోగదారులు, స్థానికుల ఇబ్బందులపై 'మార్కెట్‌కు వెళ్లాలంటే ముక్కు మూసుకోవాల్సిందే' శీర్షికన ఈ నెల 17న 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి శానిటరీ అధికారి రామచంద్రరావు స్పందించారు. మార్కెట్ పక్కన పేరుకున్న వ్యర్థాలను కార్మికులతో తొలగించి గురువారం సున్నం, బ్లీచింగ్ చల్లించారు. సమస్య పరిష్కారం కావడంతో వ్యాపారులు, వినియోగదారులు హర్షం వ్యక్తం చేశారు.

బాణసంచా దుకాణాల ఏర్పాటుపై పరిశీలన

చెరుకుపల్లి గ్రామీణ, న్యూస్‌టుడే: దీపావళికి బాణసంచా దుకాణాల ఏర్పాటుపై రేపల్లె డీఎస్పీ ఆవుల శ్రీనివాసరావు గురువారం మండలంలో పర్యటించారు. చెరుకుపల్లి ఎస్సై అనిల్‌కుమార్‌తో కలిసి తెనాలి రోడ్డులోని రవితేజ, ఆరుంబాక వద్ద లలితాంబికా ఫైర్ వర్క్స్ బాణసంచా గోదాములను ఆయన తనిఖీ చేశారు. అక్కడ తీసుకోవాల్సిన భద్రత చర్యలపై సూచనలు చేశారు. అనంతరం గుళ్లపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలను పరిశీలించి, దీపావళికి బాణసంచా విక్రయశాలలను ఈ మైదానంలో ఏర్పాటు చేసేలా చూడాలని ఎస్సైకు సూచించారు. ప్రభుత్వం నుంచి అనుమతి పొందిన వ్యాపారులు ఇక్కడ విక్రయశాలలు ఏర్పాటు చేసుకునేలా వారితో మాట్లాడాలన్నారు. ఆ రోజు వర్షం కురిస్తే తీసుకోవాల్సిన ప్రత్యామ్నాయాలపై దృష్టిపెట్టాలని ఆయన సూచించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

బాపట్ల : 80085 73141, రేపల్లె : 80085 73135, వేమూరు: 91107 837382

? చెరుకుపల్లి - తెనాలి ఆర్‌అండ్‌బీ రహదారి పక్కన కిలోమీటర్ల మేర వ్యర్థాలను పారబోస్తున్నారు. వర్షాలకు చెత్త కుళ్లి దుర్వాసన వస్తోంది. దీంతో ఆ మార్గంలో రాకపోకలకు ఇబ్బందిగా ఉండటమే కాక అనారోగ్య సమస్యలు ఉత్పన్నమయ్యేలా ఉంది.
- డి.సుబ్బయ్య, స్థానికుడు

✔ రోడ్డు పక్కన హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి వ్యర్థాలు వేయకుండా కట్టడికి తగు చర్యలు తీసుకుంటాం. పారిశుద్ధ్య కార్యక్రమాల్లో భాగంగా వ్యర్థాలను తొలగించి బ్లీచింగ్ చల్లిస్తాం.
- ఇ.విజయబాబు, పంచాయతీ కార్యదర్శి, చెరుకుపల్లి

– న్యూస్‌టుడే, చెరుకుపల్లి

మురుగు నీరు తొలగింపు

స్పందనకు వందనం

పిట్లలవానిపాలెం, న్యూస్‌టుడే : చందోలు 1వ వార్డులో ప్రధాన రహదారిపై మురుగు నీరు నిల్వ ఉండటంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇళ్లలో వాడుక నీరు వచ్చి నిల్వటంతో పాచి పట్టి వాహనదారులు జారి పడి ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ విషయాన్ని 'మేమున్నాం.. మీకు తోడుగా' శీర్షికన 'ఈనాడు' ఈనెల 15న అధికారుల దృష్టికి తెచ్చింది. స్పందించిన గ్రామ కార్యదర్శి సుజాత సిబ్బందితో కాల్వలు తీయించి మురుగునీరు పోయేలా చర్యలు తీసుకున్నారు. సమస్య పరిష్కారం కావటంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

? భట్టిప్రోలు ఓబిక్ మాల్‌లో వీధిలైటు వెలగడం లేదు. రాత్రి సమయంలో ఇబ్బందిగా ఉంది. ఆ మార్గంలో ట్యూషన్‌కు వెళ్లి వచ్చేందుకు విద్యార్థులు భయపడుతున్నారు.
– సుబానీ, భట్టిప్రోలు

✔ పంచాయతీ సిబ్బందిని పంపి మరమ్మతుకు గురైన వీధి లైటు స్థానంలో కొత్తది ఏర్పాటు చేయిస్తాం.
- శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి, భట్టిప్రోలు

– న్యూస్‌టుడే, భట్టిప్రోలు

రేపల్లె రూపురేఖలు మార్చుతాం

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే

రేపల్లె పట్టణ రూపురేఖలు మార్చేందుకు ప్రణాళికా బద్ధంగా కృషి చేస్తున్నామని పురపాలక సంఘం **కమిషనర్ కాకర్ల సాంబశివరావు** అన్నారు. పట్టణ ప్రజలకు మెరుగైన సదుపాయాల కల్పనే ధ్యేయమని తెలిపారు. రాష్ట్రంలో తెదేపా నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం, మంత్రి అనగాని సత్యప్రసాద్ సహకారంతో పట్టణాన్ని ప్రగతి పథంలో నడిపిస్తామన్నారు. పట్టణవాసులకు రక్షిత తాగునీరు, పారిశుద్ధ్యం, స్వచ్ఛత, పచ్చదనానికి తొలి ప్రాధాన్యం ఇస్తామన్నారు. అందులో భాగంగా 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.3.66 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేయించేందుకు ఇప్పటికే ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. నిత్యం వార్డుల్లో పర్యటించి ప్రజలతో మమేకమై వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని త్వరగా పరిష్కరించేలా దృష్టిసారించామన్నారు. గతం కంటే ప్రజలకు నాణ్యమైన సేవలు అందించేందుకు తమవంతు ప్రయత్నిస్తామని ఆయన తెలిపారు.

మౌలిక సదుపాయాల కల్పన

పుర ప్రజలకు కనీస సదుపాయాలు కల్పించేలా ప్రణాళిక రూపొందించాం. 27, 28 వార్డుల్లో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.40 లక్షలతో సిమెంటు రోడ్లు, రూ.25 లక్షలతో మురుగు కాల్వలను నిర్మించేలా చర్యలు తీసుకున్నాం. ఇప్పటికే టెండర్ల ప్రక్రియ పూర్తయింది. త్వరలో నిర్మాణ పనులు చేపడతాం. ప్రణాళికాబద్ధంగా అన్ని వార్డుల్లో సీసీ రోడ్లు, మురుగుకాల్వల సదుపాయం కల్పిస్తాం.



తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

15వ ఆర్థిక సంఘ నిధులు రూ.80 లక్షలతో పంపుహౌస్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరించేందుకు సన్నాహాలు చేస్తున్నాం. అమృత్ 2.0 పథకం ద్వారా పట్టణానికి రూ.26.46 కోట్లు మంజూరయ్యాయి. వాటితో 7.5 ఎంఎల్‌డీ వాటర్ ఫిల్టర్ పాయింట్, మూడు వాటర్ ట్యాంకులు, 30 కి.మీ పొడవున పైపులైన్లు ఏర్పాటు చేయిస్తాం. దీనివల్ల 28 వార్డుల్లో శివారు ప్రాంతాలకు సమృద్ధిగా తాగునీరు సరఫరా అవుతుంది. నీటి వృథా, పైపులైన్ల లీకుల బెడద తీరడంతోపాటు తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కలుగుతుంది.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి

రేపల్లెలో పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా ప్రత్యేక దృష్టిసారించాం. ప్రస్తుతం రెండు కంప్యాక్టర్లు, అయిదు ట్రాక్టర్ల ద్వారా ప్రధాన రహదారులు, వీధుల్లో వ్యర్థాలను తరలిస్తున్నాం. వాటికి తోడు రూ.60 లక్షలతో మరో కంప్యాక్టర్లు కొనుగోలు చేస్తాం. రూ.90 లక్షలతో ఇసుకపల్లి, బేతపూడి సెంటర్లో మురుగునీటి శుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకున్నాం. సెప్టిక్ ట్యాంకులను నుంచి వెలువడే వ్యర్థాలతో ఎరువు తయారు చేసేలా రూ.1.50 కోట్లతో ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తాం. ఈ పనులు సకాలంలో పూర్తి చేయించి పారిశుద్ధ్య సమస్యకు చరమగీతం పాడతాం.

ఆహ్లాదాన్ని పెంచేలా చర్యలు

పిల్లలకు మానసిక ఉల్లాసంతో పాటు ప్రజలకు ఆహ్లాద వాతావరణం కల్పించేందుకు తగు చర్యలు తీసుకున్నాం. రూ.14 లక్షలతో చంద్రమౌళి, రూ.12 లక్షలతో తాడివాక శ్రీనివాసరావు పార్కులు అభివృద్ధి చేసేందుకు రంగం సిద్ధమైంది. వీటితో పాటు రెండోవార్డు దళితవాడలో మరో ఉద్యానవనం ఏర్పాటు చేసేలా ప్రతిపాదనలు తయారు చేస్తున్నాం. దీంతో పట్టణ నలు దిక్కుల్లోని చిన్నారులు ఆడుకుని ఆనందంగా గడుపుతారు. ఆయా పార్కుల్లో వృద్ధులు ఆహ్లాదకర వాతావరణంలో కూర్చొని సేదతీరేలా సిమెంటు బల్లలు ఏర్పాటు చేస్తాం.

హరితమయం చేస్తాం

పట్టణాన్ని పచ్చదనానికి నిలయంగా తయారు చేసేందుకు ప్రాధాన్యం ఇస్తున్నాం. రూ.10 లక్షలతో విభాజకాలను అభివృద్ధి చేసి మొక్కలు నాటించి రహదారులపై రాకపోకలు చేసే వారికి ఆహ్లాకర వాతావరణాన్ని కల్పిస్తాం. అమృత్ నిధులతో నక్క, రజక, ఊర చెరువులను అభివృద్ధి చేయించి మొక్కలు నాటిస్తాం. వీటితోపాటు అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలతోపాటు, కార్యాలయ ప్రాంగణాల్లో మొక్కలు నాటించి పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తాం.

వెలగపూడి కళాశాలలో ఉద్యోగ మేళా నేడు

నగరం, న్యూస్‌టుడే: స్థానిక శ్రీ వెలగపూడి రామకృష్ణ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ అనగాని హరి కృష్ణ తెలిపారు. కళాశాల కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో టాటా క్యాపిటల్, అరబిందో ఫార్మసీ, మాస్టర్ మైండ్స్, ఏయు ఫైనాన్స్ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారన్నారు. ఆయా కంపెనీల నుంచి సుమారు 150 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారన్నారు. నిరుద్యోగ యువతీ యువకులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఎయిడెడ్ పాఠశాలల తనిఖీ

చెరుకుపల్లి, న్యూస్‌టుడే: చెరుకుపల్లిలోని శాస్త్రి ఎయిడెడ్ ప్రాథమికోన్నత పాఠశాల, పూషడపువారిపాలెంలో శ్రీ బాపూజీ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలను మండల విద్యాశాఖాధికారి పులి లాజర్ గురువారం తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన పథకం అమలుతీరు పాఠశాలల్లోని టాయిలెట్లను పరిశీలించారు. విద్యార్థులకు అందించే ఆహారం శుచిగా, శుభ్రంగా ఉంచాలని, మెనూ విధిగా అమలు చేయాలని నిర్వాహకులను కోరారు.

పురపాలక డీఈగా కృష్ణారెడ్డి



బాపట్ల, న్యూస్‌టుడే: పురపాలక డీఈగా కృష్ణారెడ్డి నియమితులయ్యారు. మంగళగిరి పురపాలక సంఘం నుంచి బదిలీపై ఆయన వచ్చారు. పురపాలక కార్యాలయంలో డీఈగా గురువారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం మాట్లాడుతూ పట్టణాభివృద్ధికి అంకిత భావంతో కష్టపడి పనిచేస్తానన్నారు. ఇప్పటి వరకు ఈ స్థానంలో పనిచేసిన శ్రీనివాసులు తెనాలి బదిలీ అయ్యారు.

సమగ్ర సస్యరక్షణతో అధిక దిగుబడులు

బాపట్ల, న్యూస్‌టుడే: సమగ్ర సస్య రక్షణ, యాజమాన్య పద్ధతులను రైతులు అవలంబించి వరిలో అధిక దిగుబడులు సాధించాలని ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త బాల మురళీధర్ నాయక్ అన్నారు. పట్టణంలోని ఏరువాక కేంద్రంలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకల్లో ఆయన చిత్రపటానికి శాస్త్రవేత్తలు గురువారం పూలమాల వేసి నివాళి అర్పించారు. అంగ్రూ విస్తరణ సంచాలకుడు జి.శివనారాయణతో కలిసి జమ్ములపాలెంలో వరి పొలాలు సందర్శించి రైతులకు సలహాలు, సూచనలు అందజేశారు. పురుగుమందులు విచక్షణారహితంగా పిచికారీ చేయరాదని, ఎరువులు అవసరమైన మేరకే చల్లాలని శివనారాయణ పేర్కొన్నారు. శాస్త్రవేత్త ఉష, వ్యవసాయ సహాయకుడు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



పైరు పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు బాల మురళీధర్ నాయక్, ఉష, అంగ్రూ విస్తరణ సంచాలకుడు శివనారాయణ

ఆగిన ప్రాణవాయువు ఉత్పత్తి

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: రేపల్లె ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రాణ వాయువు ఉత్పత్తి ప్లాంట్ కొన్ని నెలలుగా నిరుపయోగంగా మారింది. కొవిడ్-19 విపత్తు సమయంలో సకాలంలో ఆక్సిజన్ అందక అనేక మంది కరోనా బాధితులు మృతి చెందారు. ఈ క్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ రేపల్లె శాఖ హిందుస్థాన్ కోకోకోలా బేవరేజెస్ సంస్థ ఆర్థిక సహకారంతో 21 జనవరి 2022లో ఇక్కడ ఆక్సిజన్ ఉత్పత్తి కేంద్రం ప్రారంభించారు. దీంతో కరోనా బాధితులతో పాటు స్థానిక ఆసుపత్రిలో ఆయాసం, ఉబ్బసంతో బాధపడే వారికి ఈ ప్లాంట్ ద్వారా వైద్యులు ఆక్సిజన్ అందించారు. కొద్దికాలం సజావుగా పనిచేసిన ప్లాంట్ సరైన నిర్వహణ లేక మరమ్మతులకు గురై అలంకారంగా మిగిలింది. దాతల చేయూతతో నిర్మించిన ప్రాణవాయువు ఉత్పత్తి కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకు రావాలని ప్రజాసంఘాలు విజ్ఞప్తి ,చేస్తున్నాయి. ఈ విషయమై వైద్యశాల సూపరింటెండెంట్ సుధాకర్ మాట్లాడుతూ ఆక్సీజన్ ప్లాంట్‌కు మరమ్మతులు చేయించేందుకు ప్రత్యేకంగా నిధులు లేవన్నారు. సమస్యను ఉన్నతాధికారులతో పాటు మంత్రి అనగాని సత్యప్రసాద్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఆసుపత్రిలో వైద్యసేవలు పొందుతున్న రోగులకు అవసరమైన ఆక్సిజన్ సిలెండర్లలో అందుబాటులో ఉంచామన్నారు.



నిరుపయోగంగా ఆక్సిజన్ ప్లాంట్

విద్యుత్తు సరఫరాకు అంతరాయం రానీయొద్దు

కర్లపాలెం, న్యూస్‌టుడే: అధికారులు, నేతలు ప్రజలకు జవాబుదారీతనంగా పనిచేయాలని ఎమ్మెల్యే నరేంద్ర వర్మ పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. విద్యుత్తు సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని అధికారులను కోరారు. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుదలకు, తాగునీటి సక్రమ సరఫరాకు చర్యలు చేపట్టాలన్నారు. ఎంపీడీవో శ్రీనివాసరావు, ఎంపీపీ యారం వనజ, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

వాల్మీకి జీవితం స్ఫూర్తిదాయకం

బాపట్ల, గుళ్లపల్లి (చెరుకుపల్లి గ్రామీణ), న్యూస్‌టుడే: సంస్కృతంలో 24 వేల పద్యాలతో రామాయణాన్ని ఆది కావ్యంగా రాసిన వాల్మీకి మహర్షి ఆది కవిగా ప్రజల గుండెల్లో చిరస్మరణీయుడిగా నిలిచారని జేసీ ప్రఖర్‌జైన్ అన్నారు. కలెక్టరేట్లో వాల్మీకి మహర్షి జయంతి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి జేసీ పూలమాల వేసి నివాళి అర్పించారు. డీఆర్వో సత్తిబాబు, బీసీ సంక్షేమ శాఖాధికారి శివలీల, సీపీవో శ్రీనివాసులు తదితరులు నివాళి అర్పించిన వారిలో ఉన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వాల్మీకి మహర్షి చిత్రపటానికి ఎస్పీ తుషార్ డూడీ పూలమాల వేసి నివాళి అర్పించారు. పురపాలక కార్యాలయంలో ఆయన చిత్రపటానికి కమిషనర్ జి.రఘునాథరెడ్డి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఎన్టీఆర్ ఆహార విజ్ఞాన సాంకేతిక కళాశాల, ఎన్టీఆర్ ఏజీ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో వాల్మీకి మహర్షి చిత్రపటానికి ఇన్‌ఛార్జి ఏడీ వినోద, ఏడీ స్మిత్, ఆచార్యులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. చెరుకుపల్లి మండలం గుళ్లపల్లిలో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో వాల్మీకి జయంతి నిర్వహించారు. శ్రీగంగాంబికా సమేత ఆనందీశ్వరస్వామి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా మహిళలతో సామూహిక హారతి కార్యక్రమాన్ని ఫౌండేషన్ జిల్లా దేవాలయాల ప్రముఖ్ పొన్నపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సత్సంగం, క్విజ్ పోటీలను నిర్వహించారు.



వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న ఎస్పీ తుషార్ డూడీ

వానొస్తే మునకే!

నగరం, న్యూస్‌టుడే: మండల కేంద్రం నగరం గ్రామానికి సొంత సచివాలయ భవనం లేక సిబ్బంది, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. 20ఏళ్లుగా కమ్యూనిటీ భవనంలోనే ఉద్యోగులు కునారిల్లుతున్నారు. చాలీచాలని కమ్యూనిటీ భవనంలో సుమారు 20 మంది ఉద్యోగులు సేవలందిస్తున్నారు. వానలు పడితే చాలు కార్యాలయం జలమయమవుతోంది. గత నెలలో కురిసిన భారీ వర్షాలకు కార్యాలయంలోని గదుల్లోకి వర్షం నీరు చొరబడి విలువైన వస్తువులు నీట మునిగాయి. వారం రోజులుగా పడుతున్న వర్షాలకు కార్యాలయం మళ్లీ జలమయమైంది. కార్యాలయంలోకి చేరిన వాన నీటిని సిబ్బంది మోటార్లతో బయటకు పంపిస్తూనే ఉన్నారు. ఉన్నతాధికారులు స్పందించి గ్రామస్థులకు అనుకూలమైన ప్రాంతంలో సచివాలయాన్ని నిర్మించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.



వాన నీటిని బయటకు తోడుతున్న సిబ్బంది



వేమూరు: రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు



పి.వి.పాలెం: సంగుపాలెంలో సర్పంచి, తెదేపా నాయకులు..



నిజాంపట్నం: గరువుపాలెంలో సీసీ రహదారి నిర్మాణానికి భూమిపూజలో అధికారులు, నాయకులు

కూటమి పాలనలో గ్రామ స్వరాజ్యం

వేమూరు, అమృతలూరు, పిట్టలవానిపాలెం, బాపట్ల పట్టణం, కర్లపాలెం, రేపల్లె అర్బన్, నగరం, నిజాంపట్నం, న్యూస్‌టుడే: గ్రామ స్వరాజ్యానికి అసలైన అర్థాన్ని కూటమి ప్రభుత్వం చేతల్లో చూపుతోందని వేమూరు ఎమ్మెల్యే ఆనంద బాబు అన్నారు. పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా వేమూరు, అమృతలూరు మండలాల్లో పలు సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అమృతలూరు మండలం కూచిపూడిలో రూ. 30లక్షలు, వేమూరు మండలం జంపనిలో రూ. 30లక్షలు, వేమూరులో రూ. 25లక్షల ఉపాధి హామీ నిధులతో చేపట్టే పనులకు భూమి పూజ చేశారు. పిట్టలవానిపాలెం మండలం సంగుపాలెం, చందోలు గ్రామాల్లో సీసీ రహదారులకు మండల తెలుగు మహిళ అధ్యక్షురాలు గ్లోరియా నెట్ భూమి పూజ చేశారు. బాపట్ల మండల పరిధి నందిరాజు తోటలో రూ.16లక్షలతో అంగన్‌వాడీ భవన ప్రహరీ, పిన్నిబోయినవారిపాలెంలో రూ.13లక్షలతో సిమెంట్ రోడ్డుకు తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తాతా జయప్రకాష్‌నారాయణ భూమి పూజ చేశారు. మండలపార్టీ అధ్యక్షుడు ముక్కాముల సాంబశివరావు, ఎంపీడీవో బి.బాబూరావు పాల్గొన్నారు. కర్లపాలెం మండలం సమ్మెటవారిపాలెం, పేరలి పంచాయతీల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే వేగేశన భూమిపూజ చేశారు. ఎంపీడీవో శ్రీనివాసరావు, నేతలు పమిడి భాస్కరరావు, భూపతిరావు, ముసలయ్య పాల్గొన్నారు. నిజాంపట్నం మండలం గరువుపాలెం, కూచినపూడి గ్రామాల్లో సిమెంటు రహదారుల నిర్మాణానికి నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు కొలసాని రాము, తెదేపా నాయకులు నల్లపాటి ఎల్లయ్య, దున్నా సంగీతరావు, జి. రామారావు భూమి పూజ చేశారు. ఎంపీడీవో నాగలక్ష్మి, విస్తరణాధికారి రవి శంకర్, కూటమి నాయకులు పాల్గొన్నారు. రేపల్లె మండలం కామరాజుగడ్డసౌత్, నల్లూరు సౌత్, అరవపల్లి పంచాయతీల్లో రూ.45 లక్షల ఉపాధి నిధులతో నిర్మించే సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన చేశారు. సర్పంచులు బాబూ నాంచారయ్య, కృష్ణకుమారి, శ్రీనివాసరావు, ఎంపీడీవో శోభారాణి పాల్గొన్నారు. నగరం మండల పరిధిలోని బెల్లంవారిపాలెం, కారంకివారిపాలెం, బోరమాదిగపల్లి గ్రామాల్లో రూ.40లక్షల వ్యయంతో నిర్మించే సీసీ రహదారులకు ఎంపీడీవో బొర్రా శ్రీనివాస్ శంకుస్థాపనలు చేశారు.

విద్యార్థినికి చేయూత

బాపట్ల పట్టణం, న్యూస్‌టుడే : తండ్రి మరణించటంతో విద్యకు దూరం కాకూడదనే లక్ష్యంతో తమ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థిని ప్రవల్లికకు ఆర్థిక సాయం అందిస్తున్నట్లు మర్రిపూడి గ్రామానికి చెందిన కేకేఆర్ ఛారిటబుల్ ఫౌండేషన్ గౌరవాధ్యక్షుడు ఓటికుండల శ్రీనివాసరెడ్డి తెలిపారు. పట్టణంలో మల్లికార్జున బృందావనం కాలనీలో నివసించే ఏడుకొండలు ఇటీవల మృతి చెందటంతో ఆయన కుమార్తె చదువుకు ఇబ్బంది కాకూడదని ఫౌండేషన్ సభ్యులు రూ.61వేల చెక్కును గురువారం అందచేశారు. గుంటూరులోని చేబ్రోలు హనుమయ్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యుటికల్ అండ్ సైన్స్ కళాశాలలో ఫార్మా డి ద్వితీయ సంవత్సరం చదువుతున్న మోహన శ్రీ ప్రవల్లిక ఇబ్బందులను అమెరికాలోని ఫౌండేషన్ అధ్యక్షుడు ఓటికుండల విజయభాస్కరరెడ్డి దృష్టికి తేగా తక్షణమే స్పందించినట్లు తెలిపారు. ఫౌండేషన్ కోశాధికారి కె.అంజిరెడ్డి, సహాయ కార్యదర్శి వి.శ్రీనివాసరావు, జె.సువర్ణరాజు తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక పరికరాలపై అవగాహన అవసరం

నిజాంపట్నం, న్యూస్‌టుడే : మత్స్యకారులకు సాంకేతిక పరికరాలపై అవగాహన ఉంటే చేపల వేట సులభమవుతుందని మత్స్యశాఖ జేడీ సురేష్ సూచించారు. నిజాంపట్నం హార్బర్‌లో మత్స్యకార్మికులకు సాంకేతిక పరికరాలపై అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. పరికరాలను పూర్తి రాయితీతో కేంద్ర, రాష్ట్ర, ప్రభుత్వాలు అందిస్తున్నాయన్నారు. ఎఫ్‌డీవోలు కిషోర్‌రెడ్డి, సాయిసందీప్, మత్స్యకార ప్రతినిధులు పాల్గొన్నారు.

వేమూరులో వైకాపా ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రచారం

వేమూరు, న్యూస్‌టుడే: వైకాపా కార్యకర్తలు, విద్యావంతులు ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ వైకాపా అభ్యర్థి గౌతమ్‌రెడ్డి గెలుపునకు కృషి చేయాలని నియోజకవర్గ సమన్వయకర్త అశోక్‌బాబు తెలిపారు. నియోజకవర్గ వైకాపా కార్యకర్తలతో గురువారం వేమూరులో వైకాపా అభ్యర్థితో పరిచయ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైకాపా నాయకులు ఏడుకొండలు, లవకుమార్, పద్మారావు, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా జెండా పండగ

నిజాంపట్నం, న్యూస్‌టుడే: మండలంలోని బావాజీపాలెంలో బుధవారం రాత్రి వైభవంగా జెండా పండగ నిర్వహించారు. జెండాను అలంకరించి విద్యుత్తు బల్బులు సమకూర్చి అలంకరించిన ట్రాక్టరుపై ఉంచి పురవీధుల్లో ఊరేగించారు. ఉత్సవ కమిటీ, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం మెరుగుదలకు చర్యలు

బాపట్ల, న్యూస్‌టుడే: పట్టణంలోని 32వ వార్డులో లోతట్టు ప్రాంతంలో నిలిచిన నీటిలో దోమలు పెరగకుండా నివారణ మందులు పిచికారీ చేయిస్తున్నట్లు పురపాలక కమిషనర్ రఘునాథరెడ్డి తెలిపారు. హయ్యర్‌నగర్‌లో ఆయన గురువారం పర్యటించారు. నిల్వ ఉన్న నీటిలో దోమల లార్వాలు వృద్ధి చెందకుండా ఆయిల్ బాల్స్ వేయించారు.

చోరీ సొత్తు స్వాధీనం

చందోలు (పిట్టలవానిపాలెం), న్యూస్‌టుడే : పిట్టలవానిపాలెం గ్రామంలో 2023 నవంబరులో కళ్లేపల్లి శ్రీనివాసరాజు ఇంట్లో జరిగిన చోరీకి సంబంధించిన సొత్తును గురువారం స్వాధీనం చేసుకున్నట్లు చందోలు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. శ్రీనివాసరాజు ఇంట్లో రెండు సవర్ల బంగారు గొలుసు, సోనీ కలర్ టీవీ చోరీకి గురైంది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా పొన్నూరు పట్టణానికి చెందిన షేక్ కరీముల్లాను నిందితుడిగా గుర్తించి గురువారం అరెస్టు చేసి వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడిని కోర్టులో హాజరు పరిచినట్లు పేర్కొన్నారు.

వీడని ముంపు సమస్య

బాపట్ల, న్యూస్‌టుడే

వాయుగుండం తీరం దాటి వర్షాలు తగ్గినా పట్టణంలోని లోతట్టు ప్రాంతాల్లో ముంపు సమస్య వీడలేదు. 32వ వార్డు పరిధిలోని హయ్యర్‌నగర్, కొత్తపేట, డీఎంపల్లి, ఏడో వార్డులోని వెన్నెలకంటి నగర్, నాలుగోవార్డు ఆశ్రమ బజారులో ఇళ్ల మధ్య నీరు నిలిచి దుర్వాసన వెదజల్లుతూ ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. దోమల ఉద్ధృతి పెరిగింది. ముంపు బారిన పడిన 11వ వార్డు ఇందిరా కాలనీ, మూడో వార్డు రాజీవ్‌గాంధీ కాలనీ, ఏడో వార్డు శారదాపురి కాలనీలను పురపాలక కమిషనర్ జి.రఘునాథరెడ్డి గురువారం సందర్శించి కాలనీ వాసులు పడుతున్న ఇబ్బందుల్ని పరిశీలించారు. విద్యుత్తు మోటార్లు ఏర్పాటు చేయించి నీరు బయటకు తోడే పనులు ప్రారంభించారు. మిగిలిన వార్డుల్లోనూ నివాస గృహాల మధ్య నిలిచిన నీటిని మోటార్లతో తోడి దోమల నివారణ మందులు పిచికారీ చేయించి సమస్య పరిష్కరిస్తామని కమిషనర్ తెలిపారు.



హయ్యర్ నగర్‌లో ఇళ్ల మధ్య నిలిచిన నీరు

గోకర్ణమఠం ప్రజల గోడు పట్టేదెవరికి?

నిజాంపట్నం: నిజాంపట్నం పంచాయతీలో పల్లపు ప్రాంతాలు చెరువులను తలపిస్తున్నాయి. అంతర్గత రహదారులు కాలువల్లా మారాయి. గోకర్ణమఠం పల్లెపాలెం పల్లపు ప్రాంతం కావడంతో నీరు చేరి ఇబ్బంది పడుతున్నా తమ గోడు ఎవరూ పట్టించుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు వద్ద ప్రస్తావించగా తక్షణం సిబ్బందిని పంపి నీటిని మళ్లించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తామన్నారు.



ఆశ్రమబజారులో లోతట్టు ప్రాంతంలో నిలిచిన నీరు



ఇందిరాకాలనీలో పరిశీలిస్తున్న కమిషనర్ రఘునాథరెడ్డి



నిజాంపట్నం: గోకర్ణమఠం పల్లెపాలెం కాలనీని ముంచెత్తిన నీరు

ఎమ్మెల్యే వేగేశనతో టీఎన్‌ఏటీయూ నాయకుల భేటీ

బాపట్ల పట్టణం, కర్లపాలెం, న్యూస్‌టుడే : తెలుగునాడు అంగన్‌వాడీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కమిటీ (టీఎన్‌ఏటీయూ) సభ్యులు ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మను కర్లపాలెంలో గురువారం కలిశారు. పట్టభద్రుల ఓటర్ల నమోదులో భాగంగా అర్హులైన అంగన్‌వాడీలు, వారి కుటుంబ సభ్యుల పేర్ల నమోదుపై అవగాహన కల్పిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షురాలు గడ్డం అనంతలక్ష్మి వివరించారు. ప్రతి ప్రాజెక్ట్ పరిధిలో పట్టభద్రుల ఓటు నమోదు చేసుకోవాలని సూచనలు చేస్తున్నట్లు ఎమ్మెల్యేకు తెలిపారు. అనంతరం ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. టీఎన్‌ఏటీయూ సభ్యులు కొల్లి లక్ష్మీనరసమ్మ, ఉపాధ్యక్షురాలు సీహెచ్ సామ్రాజ్యం, నాగజ్యోతి, కుర్రా నాగమణి, శేషుకుమారి తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే వేగశనను కలిసి పుష్పగుచ్ఛం అందించిన యూనియన్ సభ్యులు

చీరాల

• చీరాల • అద్దంకి • పర్చూరు

కూడలిలో గుంతలు- చోదకులకు చింతలు



మేదరమెట్ల జాతీయరహదారి వంతెన కింద కూడలిలో గుంతలు

మేదరమెట్ల, న్యూస్‌టుడే: కొరిశపాడు మండలం మేదరమెట్లలోని జాతీయ రహదారి వంతెన కింద ఉన్న కూడలిలోని రోడ్డుపై పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. హైదరాబాద్ నుంచి నామ్ రహదారిలో వచ్చే వాహనాలు జాతీయ రహదారిలోకి ప్రవేశించే కూడలిలో గుంతలు ఏర్పడ్డాయి. వీటితో వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం వర్షం నీరు అందులోకి చేరడంతో ప్రమాద తీవ్రత ఎక్కువైంది. చోదకులు రాత్రి వేళల్లో గుంతలు కనిపించక ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి వీటిని వెంటనే మరమ్మతులు చేయించాలని వాహన చోదకులు కోరుతున్నారు.

రూ.4.51 కోట్ల ఉపాధి నిధులతో పనులు

ఇంకొల్లు, న్యూస్‌టుడే: ఇంకొల్లు మండలంలో రూ.4.51 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. గత నెలలో గ్రామ సభల్లో తీర్మానించి ఉపాధిహామీ పథకం ద్వారా చేపట్టాల్సిన పనులను గుర్తించి, నిధులు మంజూరు చేశారు. గ్రామాల వారీగా రూ.లక్షల్లో ఇడుపులపాడు 30, పూసపాడు 50, పంబాయలపాడు 25, నాగండ్ల 40, సూదివారిపాలెం 45, నల్లులపాలెం 20, పావులూరు 25, దుద్దుకూరు 30, కొణికి 20, గంగవరం 30, భీమవరం 30, ఇంకొల్లుకు రూ. 97 లక్షలు మంజూరు చేశారు. సీసీ రహదారులు, పశువుల, కోళ్ల షెడ్ల నిర్మించనున్నట్లు ఉపాధి ఏపీఎం రేణుక తెలిపారు.

ఎనిమిది మందికి సీఎం సహాయనిధి అందజేత

అద్దంకి, న్యూస్‌టుడే: అనారోగ్యంతో బాధపడుతున్న ఎనిమిది మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు మంజూరయ్యాయి. ఆమేరకు మంత్రి గొట్టిపాటి రవికుమార్ ద్వారా లబ్ధిదారులకు గురువారం అందించారు. అద్దంకి పట్టణానికి చెందిన ఎస్.సురేష్‌కు రూ.6,05,633, నాగులపాడుకు చెందిన కె.వెంకటేశ్వర్లుకు రూ.27,493, ఎస్.రామసుబ్బారావుకు రూ.35,166, జే పంగులూరు మండలం కోటపాడుకు చెందిన బి.అనంతలక్ష్మికి రూ.20,800, పి.శాంతమ్మకు రూ.80,597, కొమ్మినేనివారిపాలేనికి చెందిన ఎం.నిరీక్షకు రూ.90 వేలు, బొద్దువానిపాలేనికి చెందిన ఎస్.నగరాజకుమారికి రూ.35,655, కొరిశపాడుకు చెందిన కె.సాయికి రూ.20 వేల చెక్కులు అందజేశారు.

ఉద్ధృతంగా వాగులు

అద్దంకి, న్యూస్‌టుడే: వారం రోజులుగా కురిసిన వర్షాలతో అద్దంకి మండలం మోదేపల్లి వద్ద చిలకలేరులో నీటి ప్రవాహం ఉద్ధృతంగా దిగువకు ప్రవహిస్తోంది. పక్కనే గల పేరాయపాలెం సమీపంలోని దోర్నపు వాగులోనూ ఇదే పరిస్థితి నెలకొంది. దోర్నపువాగుపై కొత్తగా నిర్మించిన పైపు కల్వర్టును దాటి మూడడుగుల మేర నీరు ప్రవహించింది. ప్రస్తుతం నీటి ఉద్ధృతి కొంతమేర తగ్గినప్పటికీ వంతెన అంచుల్లో మాత్రం ప్రమాదం పొంచి ఉంది. రెండు రోజుల క్రితం దోర్నపువాగుపై నిర్మించిన పైపు కల్వర్టు దిగువక వెళ్లిన గేదెలు ప్రవాహంలో చిక్కుకున్నాయి. పైపు కల్వర్టులో గుండా బయటకు రాలేక అందులో ఇరుక్కున్నాయి. ఒక దూడి గేదె ఊపిరాడక మృతిచెందింది. మిగిలినవి గాయాలతో బయటపడ్డాయి. రెవెన్యూ, పోలీసు శాఖలు పహారా ఉంచినప్పటికీ పగటి వేళల్లో అమాయక ప్రజలు, గేదెలు పొరపాటున కాలుజారితే ప్రమాదానికి గురైనట్లే. ఆమేరకు రెండు వాగుల వెంబడి ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇదే సమయంలో తిమ్మాయపాలెం వద్ద వర్షపు నీరు చెరువులను తలపిస్తోంది. వర్షాల కారణంగా గ్రామస్థులు వరి నారుమళ్లు పోయడానికి వెనుకంజ వేస్తున్నారు.

లో ఓల్టేజీ సమస్య పరిష్కారానికి చర్యలు

పుట్టావారిపాలెం (సంతమాగులూరు): పుట్టావారిపాలెం వ్యాపార కూడలిలో లో ఓల్టేజీ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టినట్లు విద్యుత్తు ఏఈ దీపక్‌రెడ్డి గురువారం తెలిపారు. వాణిజ్య కూడలిలో విద్యుత్తు వినియోగానికి అనుగుణంగా సరిపడా నియంత్రికలు లేనందువల్ల ఈ సమస్య ఉత్పన్నమవుతున్నట్లు చెప్పారు. కూడలిలో నియంత్రికల ఏర్పాటుకు అనువైన ప్రదేశాలను గుర్తించేందుకు సర్వే చేపట్టినట్లు వివరించారు. నియంత్రికల ఏర్పాటుకు స్థానికులు సహకరిస్తే తక్షణం ఏర్పాటు చేస్తామన్నారు. దీంతోపాటు ప్రత్యామ్నాయంగా విద్యుత్తు ఉప కేంద్రం నుంచి ప్రత్యేక లైను ఏర్పాటు చేయడం ద్వారా సమస్య పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్లు ఆయన చెప్పారు.

భక్తిశ్రద్ధలతో గ్యార్మీ పండగ

యద్దనపూడి, న్యూస్‌టుడే: మండలంలోని పూనూరులో గురువారం గ్యార్మీ పండగను భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామంలోని దూదేకుల సంఘ నేతల ఆధ్వర్యంలో కడప దర్గాకు చెందిన బాబా ఆశీస్సులతో ఈ వేడుకలు జరిపారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సంఘ నాయకులు శ్రీనివాసరావు, నాగ చెంచుబాబు తదితరులు పాల్గొన్నారు.

గంజిపాలెం రోడ్డులో ఆందోళన

చీరాల అర్బన్, న్యూస్‌టుడే: పట్టణంలోని గంజిపాలెం రోడ్డులో ఉన్న పెట్రోలు బంకు సమీపంలో మద్యం దుకాణం ప్రారంభానికి లైసెన్సుదారుడు గురువారం ప్రయత్నాలు చేస్తున్నాడు. దీంతో స్థానికులు ఇక్కడ దుకాణం పెట్టడానికి వీల్లేదని కొద్దిసేపు ఆందోళనకు దిగారు. విషయం పోలీసులకు తెలియడంతో వారు ఘటనా స్థలానికి చేరుకున్నారు. దీంతో ఆందోళనకారులు నిరసన విరమించడంతో సమస్యకు తాత్కాలికంగా తెరపడింది.

వైభవంగా లక్ష తమలపాకుల పూజ



శింగరకొండ(అద్దంకి), న్యూస్‌టుడే: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా లక్ష తమలపాకుల పూజ నిర్వహించారు. ఉభయదాతలుగా గుంటూరుకు చెందిన ట్రావెల్స్ అధినేత పొనకాల శ్రీనివాసరావు దంపతులు వ్యవహరించారు.

రాయితీ శనగ విత్తనాలకు నమోదు

కారంచేడు(మార్టూరు): అన్నదాతలు రబీలో శనగ పంట సాగు చేసుకునేందుకు ప్రభుత్వ రాయితీ విత్తనాల కోసం రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని ఏవో సుధీర్‌బాబు కోరారు. 25 శాతం రాయితీపై జేజేజీ -11, క్రాక్ -2 రకాలు ఇవ్వనున్నట్లు చెప్పారు.

పల్లె పండగ.. అభివృద్ధి మెండుగ

న్యూస్‌టుడే, చీరాల గ్రామీణం



చీరాల మండలం గాంధీనగర్‌లో పంచాయతీలో సీసీ రహదారి శంకుస్థాపనలో నేతలు

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పల్లె పండగ - పంచాయతీల వారోత్సవాలు అభివృద్ధి పనులను చేరువ చేస్తున్నాయి. గ్రామాల్లో మట్టి రోడ్లకు మహర్దశ పట్టనుండగా.. పశు పోషకులకు 90 శాతం రాయితీతో కూడిన పలు రకాల షెడ్లు అందనున్నాయి. తొలి దశలో కొందరికి పథకాలు లభిస్తుండగా.. రెండో దశలో అందరికి అందించాలని నిర్ణయించారు. చీరాల నియోజకవర్గంలో మొత్తం 24 గ్రామ పంచాయతీలున్నాయి. వీటిలో చీరాల మండలం సాల్మన్ సెంటర్, వేటపాలెం మండలం పుల్లరిపాలెం మినహా మిగతా గ్రామాల్లోని 79 గ్రావెల్, మట్టి రహదారులను గుర్తించి రూ.4.10 కోట్లతో సీసీ రహదారులుగా అభివృద్ధి చేయాలని సంకల్పించారు. ఈనెల 14 నుంచి 20 వరకు నిర్వహించే వారోత్సవాలలో వీటి నిర్మాణానికి శంకుస్థాపనలు చేస్తున్నారు. దీంతో ఇప్పటి వరకు ప్రజలు పడుతున్న అవస్థలు తీరనున్నాయి. పల్లె పండగలో భాగంగా పాడి, మేకలు, కోళ్ల పరిశ్రమలకు ఊతం ఇవ్వాలని నిర్ణయించారు. నియోజకవర్గం పరిధిలో దీని కింద మొత్తం 101 గోకుల షెడ్లు మంజూరు కాగా.. నిర్మాణానికి రూ.2.18 కోట్లు కేటాయించారు. పశువుల సంఖ్యను బట్టి అయిదు రకాల షెడ్లను 10 శాతం మార్జిన్ మనీ, 90 శాతం ప్రభుత్వ నిధులు ఇస్తారు. ఆరు పశువులు ఉంటే రూ.2.30 లక్షలు, నాలుగు ఉంటే రూ.1.85 లక్షలు, రెండు ఉంటే రూ.1.15 లక్షలు ఇస్తారు. ఇందులో పది శాతం మార్జిన్ కడితే మిగతా మొత్తాన్ని అందజేస్తారు. వీటితో ఇనుప రేకులతో షెడ్లు ఏర్పాటుచేసి అన్ని కాలాల్లో పశువులు సురక్షితంగా, ఆరోగ్యంగా ఉండేలా అవకాశం కల్పించి తద్వారా పాల ఉత్పత్తి పెంచుతారు. అలాగే 20 మేకలు ఉంటే రూ.1.30 లక్షలు, 200 కోళ్లకు రూ.1.32 లక్షలు కేటాయిస్తారు.

అర్హుల గుర్తింపు

చీరాల మండలంలో 51 షెడ్లు మంజూరు కాగా.. వంద మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో ఇప్పటికి 28 మంది లబ్ధిదారులను గుర్తించారు. మరో 23 మందిని గుర్తించి దస్త్రం తయారు చేసి పైకి పంపిస్తున్నారు. వేటపాలెం మండలంలో 50 షెడ్లు మంజూరు కాగా 80 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 50 మంది అర్హులను ఈపాటికే గుర్తించారు. షెడ్ల నిర్మాణానికి అవసరమైన స్థలం ఉండి.. అది నిర్మాణానికి అనువుగా ఉండటం అర్హతగా తీసుకున్నారు. ఈ విషయాన్ని పంచాయతీ పరిధిలో పని చేసే పశు సంవర్ధక శాఖ వైద్యాధికారులు గుర్తించి ఈమేరకు ధ్రువీకరణ పత్రం అందించారు. పల్లె పండగ కింద చేస్తున్న అభివృద్ధిపై గ్రామీణ ప్రజలలో ఆనందం వ్యక్తం అవుతోంది. రహదారుల అభివృద్ధితో పాటు రాయితీతో కూడిన పథకాలు తిరిగి ప్రారంభించడం శుభ సూచికమని పేర్కొంటున్నారు. రెండో దశ కింద మిగతా లబ్ధిదారులకు గోకుల షెడ్లు అందేలా చర్యలు తీసుకుంటామని పంచాయతీరాజ్, ఉపాధి హామీ అధికారులు పేర్కొంటున్నారు.



మోదేపల్లి-పేరాయపాలెం మధ్యలో కూలిన స్తంభం

ఒరిగిన స్తంభం.. పొంచిన ప్రమాదం

అద్దంకి: భారీ వర్షాలకు పొలాల్లోని విద్యుత్తు స్తంభాలు నేలకొరుగుతున్నాయి. అద్దంకి, బల్లికురవ మండలాల్లో ఇలాంటివి ఎక్కువగా సంభవించాయి. అద్దంకి మండలం మోదేపల్లి-పేరాయపాలెం మధ్య మాగాణిలో విద్యుత్తు స్తంభాలు నేలకొరిగాయి. అలాగే బల్లికురవ మండలం కొమ్మినేనివారిపాలెం సమీపంలోనూ ఒరిగాయి. ఆయా ప్రాంతాల్లోని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈవిషయమై గ్రామీణ విద్యుత్తు ఏఈ శివప్రసాద్‌ను వివరణ కోరగా వెంటనే మరమ్మతులు జరిపిస్తామన్నారు.



కొమ్మినేనివారిపాలెం వద్ద ఇలా.

దీపావళి నుంచి ఉచిత సిలిండర్లు

అద్దంకి, న్యూస్‌టుడే: దీపావళి నుంచి పేద మహిళలకు మూడు ఉచిత గ్యాస్ సిలిండర్‌లు అందించనున్నట్లు మంత్రి వివరించారు. అద్దంకి మండలంలో మోదేపల్లిలో గురువారం జరిగిన పల్లెపండగలో ఆయన పాల్గొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ ఒక్కొక్కటిగా నెరవేర్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అద్దంకి నుంచి మోదేపల్లి రహదారిలో ఏర్పడిన గోతులకు తక్షణం రూ.70 లక్షలు మంజూరు చేస్తున్నట్లు మంత్రి వివరించారు. నెలరోజుల్లో అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల భవనాలు పూర్తి చేస్తామన్నారు. గత తెదేపా ప్రభుత్వంలో ఒక్క రూపాయితో నిలిచిన గృహ నిర్మాణ బిల్లులు వెంటనే ఇప్పించాలని సంబంధిత శాఖ సిబ్బందికి సూచించారు. మోదేపల్లి ఎస్సీ కాలనీ వాసులకు సామాజిక భవనం కేటాయిస్తున్నట్లు చెప్పారు. గ్రామానికి వచ్చిన మంత్రికి గ్రామస్థులు ఎదురేగి స్వాగతం పలికారు. సర్పంచి వంపుగుడి అంజనాయి, డ్వామా పీడీ ఏవీ.విజయలక్ష్మి, పంచాయతీరాజ్ డీఈ విఠల్‌రాథోడ్, విద్యుత్తు ఈఈ నల్లూరి మస్తాన్‌రావు, తెదేపా నేతలు నాగినేని రామకృష్ణ, కరి పరమేష్, భీమని శ్రీనివాసరావు, నర్రా వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు బల్లికురవ మండలంలో పల్లెపండగకు మంత్రి

బల్లికురవ(అద్దంకి), న్యూస్‌టుడే: పల్లెపండగ - గ్రామ పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా అంబడిపూడిలో జరిగే అభివృద్ధి పనుల శంకుస్థాపనకు మంత్రి గొట్టిపాటి రవికుమార్ హాజరవుతారని ఎంపీడీవో కుసుమకుమారి తెలిపారు.

అభివృద్ధి.. సంక్షేమమే లక్ష్యం



వలపర్లలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి

మార్టూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వం ప్రజల అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తోందని సీఎం చంద్రబాబునాయుడు పారిశ్రామిక అభ్యున్నతికి ప్రత్యేక శ్రద్ధతో వివిధ పరిశ్రమలు రాష్ట్రంలోకి తరలివచ్చేలా శ్రమిస్తున్నారని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. మండలంలోని వలపర్లలో గురువారం ఆయన పర్యటించారు. గ్రామస్థుల సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి అధికారులతో మాట్లాడి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని తెలిపారు. యువతకు ఉపాధి కల్పించేలా కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టితో పాలన సాగిస్తోందని వెల్లడించారు. అయిదేళ్ల వైకాపా పాలనలో వ్యవస్థలన్నీ ధ్వంసమయ్యాయని, వాటి రూపురేఖలు మార్చేందుకు తీవ్రంగా శ్రమిస్తుందని ఏలూరి వెల్లడించారు. క్యాంప్ కార్యాలయంలో తనను కలిసేందుకు వచ్చిన నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు.

చదువుకు ప్రోత్సాహం

వేటపాలెం, న్యూస్‌టుడే: అక్కాయిపాలెం జడ్పీ పాఠశాలలో ఈ ఏడాది పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు గ్రామానికి చెందిన చోడ్రోలు శేఖర్‌బాబు నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. గురువారం బడిలో జరిగిన సభలో విద్యార్థులు పి.అనురాధ, జె.మహేష్, వి.మీనాక్షిలకు వరుసగా రూ.8వేలు, రూ.6వేలు, రూ.5వేలు వంతున అందజేసి మాట్లాడుతూ తాను ఇదే పాఠశాలలో చదువుకున్నట్లు చెప్పారు. డిప్యూటీ డీఈవో అబ్బురాజు శ్రీనివాసరావు, దాత కుటుంబ సభ్యులు సుధీర్, కల్పన, ప్రధానోపాధ్యాయుడు బద్రిరెడ్డి, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, జయరావు, శ్రీనివాసరెడ్డి, అనురాధ, అంజమ్మ, బాలసుబ్రహ్మణ్యం, ఖమరున్నీసా బేగం ఉన్నారు.

పౌష్టికాహారంపై శ్రద్ధ అవసరం

ఏల్చూరు (సంతమాగులూరు): చిన్నారులకు, బాలింతలకు, గర్భిణులకు పౌష్టికాహారం అందించడం ద్వారా రక్తహీనత నుంచి కాపాడవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రమీల తెలిపారు. రామిరెడ్డిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మునగాకు ఉపయోగించడం వల్ల ఎలాంటి ఖర్చు లేకుండా కావాల్సిన పోషక పదార్థాలు అందుతాయని తెలిపారు. అందుబాటులో ఉచితంగా దొరికే మునగాకును కూరల్లో అందరూ ఉపయోగించాలని సూచించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

20 మద్యం దుకాణాలు ప్రారంభం

అద్దంకి, న్యూస్‌టుడే: అద్దంకి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయం పరిధిలో మొత్తం 23 ప్రైవేటు మద్యం దుకాణాలకు 20 చోట్ల మాత్రమే తెరిచినట్లు సీఐ ఎ.భవానీ తెలిపారు. అద్దంకి, బల్లికురవ, సంతమాగులూరు మండలాల్లో ఒక్కొక్కటి చొప్పున దుకాణాలకు సరైన స్థలం లేని కారణంగా ప్రారంభించలేకపోయినట్లు చెప్పారు.

రామకృష్ణ మృతికి దిగ్భ్రాంతి

చినగంజాం: పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆధ్వర్యంలో చినగంజాం పంచాయతీ పరిధిలోని సోపిరాలలో బుధవారం జరిగిన పల్లె పండగ కార్యక్రమంలో ఉత్సాహంగా బాపట్ల జిల్లా పంచాయతీరాజ్ ఎస్ఈ జాగర్లమూడి హరేరామకృష్ణ పాల్గొన్నారు. ఇది పూర్తయిన తర్వాత తమ శాఖకు సంబంధించిన అధికారులతోనూ స్థానికంగా కొంత సమయం గడిపారు. గురువారం మృతిచెందడంతో ఆ శాఖ చినగంజాం ఏఈ కె.రామచంద్రుడు, పర్చూరు డీఈ ఆదినారాయణ, సిబ్బంది దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఎస్ఈ సొంతూరు పమిడిపాడులోని ఇంటికి వెళ్లి మృతదేహానికి నివాళులర్పించినట్లు ఏఈ తెలిపారు.

కీలకం.. సమస్యల కేంద్రం

అద్దంకి, న్యూస్‌టుడే

నామ్ ఎక్స్‌ప్రెస్ రహదారిపై అద్దంకి పట్టణంలో భవానీ కూడలికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. పూర్వాశ్రమంలో ఇక్కడ భవానీ థియేటర్ ఉండేది. చుట్టుపక్కల గ్రామాల నుంచి ఎడ్లబండ్లపై సినిమాలు చూసేందుకు ప్రజలు వచ్చేవారు. రెండు దశాబ్దాల క్రితం వరకు సినిమాలు ప్రదర్శించారు. కాలక్రమంలో ఆ ప్రాంతంలో దుకాణ సముదాయం ఏర్పడింది. భవానీ థియేటర్ కారణంగానే నామ్ రహదారి మలుపులోని కూడలికి 'భవానీ కూడలి'గా ప్రాచుర్యం పొందింది. చారిత్రక నేపథ్యం కలిగిన వెయ్యి స్తంభాల గుడి, గాడిద శాసనం, విఘ్నేశ్వర స్వామి గుడి, రామయ్య పంతులు బడి వంటివి ఇక్కడ ప్రత్యేకమైనవి. కూడలి నుంచి దర్శి వైపు, ప్రభుత్వ ఆసుపత్రి, ఆర్టీసీ బస్టాండ్, రేణంగివరం, శింగరకొండ వంటి చోట్లకు వెళ్లేందుకు కీలకంగా ఉంది. నేడిది వాణిజ్య కేంద్రంగా మారింది. వ్యాపార దుకాణాలు, మాంసం/చేపల మార్కెట్, ఏఎంసీ చెక్‌పోస్టు, కార్పొరేట్‌తో పాటు గ్రామీణ వైద్యుల ఆసుపత్రులు అందుబాటులో ఉన్నాయి. ఇంతటి ప్రాధాన్యం ఉన్నప్పటికీ సమస్యలు నెలకొన్నాయి.

➻ ఇరుకు రహదారి, గుంతలు, ఆక్రమణలు, మురుగునీటి నిల్వలు
➻ ఇదీ భవానీ కూడలి పరిస్థితి



నామ్ ఎక్స్‌ప్రెస్ రహదారిపైన గల భవానీ కూడలి

అద్దంకి నుంచి ఉద్యోగ, వ్యాపార రీత్యా వేర్వేరు ప్రదేశాలకు వెళ్లేందుకు ప్రయాణికులు ఈ కూడలి నుంచే వెళుతుంటారు. అలాగే వివిధ పనులపై వచ్చే వారు ఇక్కడే దిగుతారు. వీరు కొద్దిసేపు నిలబడేందుకు నిలువ నీడలేదు. వర్షం, ఎండ సమయంలో రహదారుల అంచుల్లోనే నిలబడాల్సి వస్తోంది. బస్‌షెల్టర్లు మూడు వైపులా ఏర్పాటు చేయాలని పట్టణ ప్రజలు పురపాలక సంఘం అధికారుల్ని అడిగారు. మురుగుకాలువల్లో నీరు దిగువకు పారుదల లేకుండా పోయింది. పట్టణ పరిధిలోని కాలువల్లోని మురుగు నీరు దిగువకు వెళ్లే సదుపాయం లేకుండా పోయింది. అందువల్ల కొద్దిసేపు ఇక్కడ నిలబడాలన్నా కష్టంతో కూడిన పని. ప్రతిరోజూ పట్టణానికి వివిధ పనుల నిమిత్తం వచ్చేవారు మల, మూత్రవిసర్జనకు అవకాశం లేదు. గత వైకాపా ప్రభుత్వంలో పే అండ్ యూజ్ మూత్రశాల నిర్మాణానికి సంకల్పించారు. సరైన ప్రదేశం దొరక్క ఆ ప్రక్రియ అక్కడే ఆగింది. భవానీ థియేటర్ పక్కనే గల రీడింగ్ రూం నిరుపయోగంగా మారింది. ప్రస్తుతం పందులు, కుక్కలు సంచరిస్తున్నాయి. స్థానికులు చెత్తను తెచ్చి పడేస్తున్నారు. స్థానికంగా నెలకొన్న సమస్యలపై ప్రజలు ఆందోళన చెందుతున్నారు.


అడుగడుగునా గుంతలే



కూడలిలో రహదారులపై అడుగడుగునా గుంతలే. వాటిని పూడ్చితేనే వాహనచోదకుల కష్టాలు తీరేది. కూడలిలో ఆక్రమణలు భారీగా పెరిగాయి. వాటిని ఖాళీ చేయిస్తే విశాలమైన రోడ్లలో వాహనాలు సులభంగా తిరిగే వీలుంటుంది. ఆదివారం నాడు నామ్ రహదారిపైనే పందులను కోసి, మాంసం విక్రయిస్తుంటారు. ఈ కారణంగా వాహనాలు రోడ్డుపైనే నిలుపుతారు. వెయ్యి స్తంభాల గుడి పరిసరాల్లో మాంసం/చేపల విక్రయాలు నిలిపివేయాలి.

– మురకొండ ధనుంజయరావు, వేయి స్తంభాల గుడి కమిటీ బాధ్యులు, అద్దంకి

బురదమయంగా రీడింగ్ రూం



మురుగు సమస్య అధికంగా ఉంది. ఎగువ నుంచి వచ్చే మురుగు నీరు దిగువకు వెళ్లే వీలు లేదు. రీడింగ్‌రూం పూర్తిగా బురదమయంగా మారింది. పందుల సంచారం పెరిగింది. పురపాలక సంఘం దాన్ని ఆధునికీకరించాలి. ప్రయాణికుల, వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ సిగ్నల్స్, కానిస్టేబుల్‌ను ఏర్పాటు చేయాలి. తాత్కాలిక బస్‌షెల్టర్‌లు ఏర్పాటు చేయడం ద్వారా ప్రజలకు మేలు చేకూరుతుంది.

– డాక్టర్ షేక్ మీరావలి, గ్రామీణ వైద్యులు, అద్దంకి

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

చీరాల అర్బన్: 9849165189 అద్దంకి: 9440915704 పర్చూరు: 8008574106

? వైకుంఠపురం రైల్వే గేటు దాటిన తరువాత నుంచి దండుబాట వరకు మురుగుకాలువలు పూడికలు తీయకపోవటంతో దుర్వాసన వస్తుంది. **-వెంకటేశ్వర్లు, స్థానికుడు**

✔ సిబ్బందిని పంపి పూడిక తీయిస్తాను.

-ప్రవీణ్, పారిశుద్ధ్య ఇన్‌స్పెక్టర్

చీరాల, న్యూస్‌టుడే :

? కడవకుదురు ఆర్‌అండ్‌బీ రోడ్డు పాత చెక్ పోస్టు కార్యాలయం ఎదుట మలుపు వద్ద వర్షపు నీరు నిలిచింది. వాహనాలు, ప్రజల రాకపోలకు ఇబ్బందిగా ఉంది. దోమల బెడద ఉంది. సమస్యను పరిష్కరించండి.

ఆర్.శ్రీనివాసరావు, స్థానికుడు

✔ ఆ ప్రాంతాన్ని పరిశీలించి, అక్కడ నీటిని తొలగించి సమస్యను పరిష్కరిస్తా. **- పి.శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి, కడవకుదురు.** కడవకుదురు (చినగంజాం), న్యూస్‌టుడే

వాల్మీకి మహర్షికి నివాళి



గ్రంథాలయంలో వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పాఠకులు

చీరాల, న్యూస్‌టుడే: రామాయణ ఇతిహాసాన్ని మానవాళికి అందించి రఘురాముని గురించి, ధర్మం గురించి తెలియజెప్పిన గొప్ప వ్యక్తి వాల్మీకి మహర్షి అని వక్తలు పేర్కొన్నారు. మహర్షి వాల్మీకి జయంతిని వాల్మీకి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం స్థానిక రోటరీ కమ్యూనిటీ హాలులో నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు కామినేడి రామకృష్ణ, అధ్యాత్మిక పీఠం అధ్యక్షుడు వెంకటరావు తదితరులు మాట్లాడారు. మంత్రి కృష్ణమోహన్, బీవీ కృష్ణ శక్తిధర్ పాల్గొన్నారు. శాఖా గ్రంథాలయంలో వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. గ్రంథపాలకురాలు ధనమ్మ పాల్గొన్నారు.

కారంచేడు(మార్టూరు), న్యూస్‌టుడే: కారంచేడు శివాలయం వద్ద వాల్మీకి యూత్ ఆధ్వర్యంలో మహర్షి వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి, పూజలు నిర్వహించారు. కొడవలివారిపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఎ.ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై లారీని ఢీకొట్టిన ఆటో

మార్టూరు, న్యూస్‌టుడే: చెన్నై - కోల్‌కతా జాతీయ రహదారిపై లారీని ఆటో ఢీకొట్టిన సంఘటన గురువారం తెల్లవారుజామున జరిగింది. రాంచి నుంచి బెంగళూరు వెళ్తున్న ఐచర్ వాహనాన్ని డేగర్లమూడి వద్ద టాటా మ్యాజిక్ వాహనం వ్యతిరేక దిశలో వెళ్తూ ఢీకొట్టినట్లు హైవే పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదంలో ఆటో ముందుభాగం నుజ్జవ్వగా చోదకుడు మహబూబ్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.

పారదర్శక రాజకీయాలకు ప్రాధాన్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందని వాటిని ప్రజలకు వివరించి పార్టీకి ప్రభుత్వానికి కార్యకర్తలు వారధిగా నిలవాలని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదుపై నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం గురువారం రాత్రి పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేయటమే అజెండాగా ప్రతి కార్యకర్త కృషిచేయాలన్నారు. ప్రజలు చంద్రబాబుపై నమ్మకంతో మనల్ని గెలిపించారని, వారికి మంచి చేస్తేనే మరోసారి అవకాశం వస్తుందన్నారు. పారదర్శక రాజకీయాలకు ప్రాధాన్యతనిస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ముందుంచుతానని, తీరానికి వచ్చేవారికి ఆహ్లాదం కలిగించేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అనంతరం సభ్యత్వ నమోదు, ప్రయోజనాలపై పార్టీ నేత ఎస్.శాంతిబాబు వివరించారు. కార్యక్రమంలో సజ్జా హేమలత, జనార్దన్, నాయకులు పాల్గొన్నారు.

★ పల్లెపండగలో భాగంగా గురువారం గవినివారిపాలెంలో రూ.23 లక్షలతో నిర్మిస్తున్న రహదారులు, ఈపూరుపాలెంలో రూ.30లక్షల వ్యయంతో నిర్మిస్తున్న రహదార్లకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పల్లెల ప్రగతే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

మార్టూరు, న్యూస్‌టుడే: మండలంలోని కోలలపూడిలో వివిధ వీధుల్లో మంజూరైన సీసీ రోడ్లకు భూమిపూజ నిర్వహించారు. సర్పంచి ఎం.సతీష్‌బాబు ఆధ్వర్యంలో గురువారం పల్లెపండగ కింద మంజూరైన ఎన్‌ఆర్ఈజీఎస్ నిధులతో కాల్వలు, సీసీ రోడ్ల నిర్మాణానికి కొబ్బరికాయలు కొట్టి శంకుస్థాపన నిర్వహించారు.

గ్రామాల్లో అభివృద్ధి పనులకు ఇదే మంచి తరుణం



కొమ్మినేనివారిపాలెంలో భూమి పూజ

అద్దంకి, జే పంగులూరు, మార్టూరు, పర్చూరు, యద్దనపూడి, కారంచేడు, న్యూస్‌టుడే: గ్రామాల్లో అభివృద్ధి పనులకు ఇదే మంచి తరుణం అని ఎంపీడీవో బి.సింగయ్య అన్నారు. అద్దంకి మండలం మోదేపల్లి, తిమ్మాయపాలెం, రామాయపాలెం, గోపాలపురం, జార్లపాలెం గ్రామాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. తహసీల్దార్ జి.శ్రీచరణ్, ఏపీవో గాయత్రీలక్ష్మి, గృహనిర్మాణ ఏఈ కిరణ్, పంచాయతీరాజ్ ఏఈ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. జే పంగులూరు మండలం రామకూరు, భగవాన్‌రాజుపాలెం, బైటమంజులూరు గ్రామాల్లో జరిగిన అభివృద్ధి పనుల్లో ఎంపీడీవో స్వరూపరాణి పాల్గొన్నారు. బల్లికురవ మండలంలో కొమ్మినేనివారిపాలెం, వైదన, ముక్తేశ్వరం గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో ఎంపీడీవో కుసుమకుమారి పాల్గొన్నారు.

★ పర్చూరు నియోజకవర్గంలోని యద్దనపూడి మండలం తనుబొద్దివారిపాలెం, జాగర్లమూడి, మార్టూరు మండలం బొల్లాపల్లి, తాటివారిపాలెం, కారంచేడు మండలం రాగప్పనాయుడువారిపాలెం, పర్చూరు మండలం నాగులపాలెంలో పల్లెపండగ నిర్వహించారు. ఎంపీడీవోలు నేతాజి, ప్రద్యుమ్నకుమార్, శ్రీనివాసరావు, జావీద్, నేతలు రంగయ్య చౌదరి, షంషుద్దీన్, శివారెడ్డి, వెంకటస్వామి, శ్రీహరి, శేఖర్‌బాబు పాల్గొన్నారు.

మోసం చేద్దామనుకొని.. ఖాకీల చేతికి చిక్కి

గన్నవరం గ్రామీణం: డోర్ డెలివరీని అడ్డం పెట్టుకొని సరకులతో ఉడాయించేందుకు యత్నించిన వ్యక్తిని పోలీసులకు అప్పగించిన ఘటన గన్నవరంలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల వివరాల మేరకు.. పశ్చిమ గోదావరి జిల్లా తణుకు మండలం పైడిమర్రుకు చెందిన ఇమ్మడి శివగణేష్ జల్సాలకు అలవాటుపడ్డాడు. బైక్ చోరీల కేసులో జైలుకెళ్లాడు. అనంతరం డాక్టర్, అధికారిని అంటూ మోసాలకు పాల్పడుతూ జీవిస్తున్నాడు. గన్నవరంలోని ఓ కిరాణా దుకాణం వద్దకు బుధవారం వచ్చిన శివగణేష్.. సుమారు రూ.15 వేల విలువైన నిత్యావసరాలను డోర్ డెలివరీ ఇవ్వాలని కట్టించాడు. పాత తెదేపా కార్యాలయాన్ని ఆనుకొని ఉన్న ఓ బహుళ అంతస్తు వద్దకు సరకులతో వ్యాపారి చేరుకోగానే నగదు తీసుకొస్తానని అపార్ట్‌మెంట్ లోపలకు వెళ్లాడు. మూడో అంతస్తు వద్ద నివాసితులు ఎందుకు వచ్చారని ప్రశ్నించడంతో అక్కడి నుంచి ఉడాయించేందుకు ప్రయత్నించాడు. చుట్టుపక్కల వారు అతడిని అదుపులోకి తీసుకొని పోలీసులకు అప్పగించారు. నిందితుడిపై చీరాలలో మోసాలకు పాల్పడిన, సెల్‌ఫోన్ చోరీ కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. చీరాల పోలీసులకు అప్పగించనున్నట్లు చెప్పారు.